AL - HILAL

నెలవంక

మాస పత్రిక



Vol 7, Issue: 48 October - 2010

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى

మన సంస్కృతి మనది

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

ఉచితం

“ఒకవేళ ముస్లింలలోని రెండు పక్షాల వారు పరస్పరం గొడవపడితే వారి మధ్య సయోధ్య చేయండి. మరి వారిలో ఒక పక్షం వారు రెండవ పక్షం వారిపై దౌర్జన్యం చేస్తే, దౌర్జన్యం చేసే వర్గం దైవాజ్ఞ వైపు మరలి వచ్చే వరకూ మీరు వారితో పోరాడండి. మరి వారు గనక దారికి వస్తే వారి మధ్య న్యాయసమ్మతంగా సయోధ్య కుదుర్చండి. సమభావంతో వ్యవహరించండి. నిశ్చయంగా సమభావంతో వ్యవహరించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు”.

(దివ్య ఖుర్‌ఆన్ - 49: 9)



సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 7, ISSUE: 48
October 2010

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhammad Azeezur Rahman

EXECUTIVE EDITOR
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Sk. Habeebur Rahman Jamaee
Sk. Abdus Salam Omeri
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONES
M.Azeezur Rahman
66104547
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc-kw.com

DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net
Tel. 99993072


ఈ సంచికలో....

ఈ నిలయం...కలకాలం... 2
ప్రవక్త అనుసరణే పరమావధి 3
ఘన సంస్కృతి మనది 4
ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) 6
తూరుపు దిక్కున సూరీడు... 10
ఇస్లాం శిక్షణ 12
కవితలు 13
ధర్మ సందేహాలు 14
నేటి బాలలే రేపటి పౌరులు - 6 15
వార్తలు 16
షిర్క్ పుట్టు పూర్వోత్తరాలు - 4 18
నా అన్వేషణ ఫలించింది - 2 20



كلمة العدد ◄ آتباع الرسول ◄ ثقافتنا الإسلامية ◄ سيرة ابراهيم عليه السلام ◄
الشمس تشرق من مشرقها ◄ تربية المهتدين ◄ النشيد - الأم - القرآن ◄
الفتاوى الشرعية ◄ روضة الأطفال ◄ كيف بدأ الشرك ◄
قصة مهتدي ◄

بسم الله الرحمن الرحيم



ఈ నిలయం... కలకాలం... శ్రీ నిలయమై నిలవాలి

శుభాల మాసమైన రమజాన్ అలా వచ్చి ఇలా వెళ్ళిపోయింది. ఎడారిలో ఒయాసిస్సులా చల్లగా పలకరించింది. దాహార్తుల దాహం తీర్చింది. కోట్లాది శుభాత్మల్ని భక్తీ పారవశ్యంలో ఓలలాడించి, సెలవు తీసుకుంది. నెల రోజులు ఎలా గడిచాయో తెలియనే లేదు. 'మండుటెండల్లో ఉపవాసమెలా ఉండగలమో ఏమో! అని మీమాంసకు గురైనవారు సయితం అలవోకగా ముప్ఫై రోజుల ఉపవాస వ్రతాన్ని పూర్తి చేయగలిగారు - అల్‌హమ్దు లిల్లాహ్!

కువైట్ ప్రభుత్వ సంస్థలు, దాని అనుబంధ సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, శ్రేయోభిలాషులు, కంపెనీలు విస్తృత ప్రాతిపదికపై ఇఫ్తార్ ఏర్పాట్లు చేసి ఉపవాసకులకు ఆదరువుగా నిలిచాయి. వివిధ సెగ్మెంట్లలోని సేవాసంస్థలు సామూహికంగా జకాత్, సదకాలను వసూలు చేసి అగత్యపరులకు, అవసరార్థులకు పంపిణీ చేశాయి.

జీవనోపాధి కోసం ఈ దేశానికి వచ్చిన పలు దేశాల, భాషా సముదాయాలలో ధార్మిక చైతన్యాన్ని మేల్కొల్పి, వారి మధ్య సమన్వయం సాధించే దిశలో కువైట్ వక్ఫ్ బోర్డు ఇస్లామీయ విభాగం వారు చేపట్టిన నిర్మాణాత్మక కార్యక్రమాలు ఈ సందర్భంగా మరుపురానివి. లక్షలాది మంది అవసరాలను గుర్తించి, వారి వారి భాషలలో మేధావుల, పండితుల చేత ధర్మబోధనా కార్యక్రమాలను, జుమా ప్రసంగాలను ఏర్పాటు చేయటం శ్లాఘనీయం. భారతీయులు, చైనయులు, బంగ్లాదేశీయులు, ఫిలిప్పీన్లు సహా అనేక దేశాలవారు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ఇతోధిక ప్రయోజనం పొందుతున్నారు. దానికితోడు రమజాన్ నెలలో ప్రభుత్వం ఆయా దేశాలకు చెందిన ధర్మ జ్ఞానులను, ప్రవీణులను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించి సదస్సులను ఏర్పాటు చేయటం, పండుగ రోజు వివిధ భాషా సముదాయాల కోసం ప్రత్యేకంగా ఈద్ నమాజ్ సౌలభ్యాన్ని సమకూర్చటం కూడా కొనియాడదగిన విషయమే.

అదలా ఉంటే, స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రభుత్వ తోడ్పాటుతో అరబ్బేతరుల కోసం అరబీ భాషా కోర్సులను నిర్వహించటం, వారి మాతృ భాషల్లో ధార్మిక సాహిత్యాన్ని, పత్రికలను వెలువరించడం కూడా గమనార్హమే. ఒక్క ఐపిసి సంస్థ వారే వివిధ దేశభాషల్లో 6 మాస పత్రికలను ప్రచురిస్తూ ఉచితంగా సర్క్యులేట్ చేస్తున్నారు. దీనివల్ల ఆయా కమ్యూనిటీల వారికి గొప్ప మేలు కలుగుతోంది. దప్పిక గొన్నవారు బావి దగ్గరకు వెళ్ళకపోగా, బావులే దాహమైన వారి దగ్గరకు వస్తున్నాయి. ప్రాపంచిక వ్యవహారాల్లో ఇలా జరగదు, ఒక్క ధార్మిక విషయంలోనే ఇలా జరుగుతుంది - అద్భుతం కదూ!

నేడు వ్యక్తులు, సంస్థలు, వ్యవస్థలు సర్వత్రా ఈ కర్తవ్యాన్ని గుర్తెరిగి ఇతోధిక సహకారం అందించటం కూడా శుభ సూచకమే. ఇలాంటి శ్రేయోభిలాషుల గురించి పరమ ప్రభువు తన అంతిమ గ్రంథంలో ఇలా కొనియాడాడు:

> **"(వారెలాంటివారంటే) మేము గనక వారికి భువిలో అధికారాన్ని ఇస్తే వారు ఖచ్చితంగా నమాజును నెలకొల్పుతారు. విధిగా జకాతును చెల్లిస్తారు. మంచి కోసం పాటుపడతారు. చెడుల నుండి ఆపుతారు. సమస్త వ్యవహారాల పరిణామం దైవాధీనమై ఉంది సుమండి!" (22: 41)**

"దౌలతుల్ కువైట్"గా వ్యవహరించబడే ఈ చిట్టిపొట్టి రాజ్యం గత నాలుగు దశాబ్దులుగా సంక్షేమ పథకాలకు శ్రీ నిలయంగా విరాజిల్లుతోంది. ఎన్నో దేశాల్లోని అనాథలు, నిరుపేదలు, ప్రకృతి వైపరీత్యాల వాతన పడిన బాధితులు, పేద విద్యార్థులు ఈ రాజ్యం వంక ఆశగా ఎదురు చూస్తూ ఉంటారు. ఇక్కడి పౌరుల యోగక్షేమాలను కోరుకుంటూ ఉంటారు. ముఖ్యంగా రమజాన్ మాసంలో ఈ ఆర్ద్రత, ఉద్వేగం మరింత స్పష్టంగా తొణికిసలాడుతున్నట్లు గోచరిస్తుంది. శుభప్రదమైన ఈ వాతావరణాన్ని గమనిస్తున్నప్పుడు ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి మస్తిష్కంలో తళుక్కున మెరుస్తూ ఉంటుంది:

> **"బస్తీలలో దిద్దుబాటుకు యత్నించేవారు నివసిస్తూ ఉండగా ఆ బస్తీలను అన్యాయంగా తుదముట్టించవలసిన అవసరం నీ ప్రభువుకు లేదు సుమా!" (11: 117)**

ప్రవక్త అనుసరణే పరమావధి



ఎస్.ఎమ్.మలిక్
smmallick@hotmail.com

అందరూ దైవాన్ని విశ్వసించినవారే. అందరి అంతర్యాల్లోనూ దైవభక్తి మధుపాత్ర పొంగి పొరలుతూనే ఉంది. అందరూ దైవ ప్రేమామృతం గ్రోలినవారే. దైవధ్యాన పరాయణతలో పరవశులయి స్వాప్నిక జగత్తులో స్వర్గవిహారం చేసేవారే మనలో అధికం. భూమ్మీద కాలుమోపి, కళ్ళు తెరచి, దైవ విశ్వాసం, దైవ భక్తి వల్ల మనకు ఆసన్నమయిన బాధ్యతలేమిటో, మన కర్తవ్యమేమిటో ఆలోచించడానికి, దైవ స్మరణలో విలీనమయి ఉన్న మనకు, అవకాశమూ లభించదు, వ్యవధీ దొరకదు.

భక్తీ ప్రేమలు కేవలం మానసికమయిన వృత్తులే కావు. వాటికి శారీరక ప్రవృత్తులతోనూ సంబంధముంది. దైవ భక్తి, దైవ ప్రేమ గల మనిషి ఆంతర్యం ఉజ్వలంగా, నిష్కల్మషంగా విలసిల్లడమేకాక, దయ, క్షమ, ప్రేమాది గుణాలతో కూడా విరాజిల్లుతుంది. త్యాగం, సహనం, సౌశీల్యం, నిస్వార్థతలు అలాంటి వ్యక్తిలో పుష్కలంగా వ్యక్త మవుతాయి. భోగలాలస, ఈర్ష్యాద్వేషాలు, క్రోధావేశాలు, ఆశామోహాలు అతని దరి చేరవు. అందువల్ల అతని ఆచరణ కూడా అతని ఆంతరంగిక భావాలకు అద్దం పట్టేలా, అతని ఆలోచనా విధానానికి తార్కాణంగా ఉంటుంది.

దేవుడు తన భక్తులు, దాసుల నమ్మకాలకే కాదు, ప్రవర్తనలకు కూడా మార్గం చూపాడు. ఆలోచనలకే కాదు ఆచరణలకు సయితం దారి చూపాడు. విధానాలు, సిద్ధాంతాలే కాదు క్రియాశీలకమయిన ఆదర్శాలూ నిలిపి చూపాడు.

ఆ క్రియాశీలక ఆదర్శాలు మనిషి పుడమిపై కాలు మోపిన నాటి నుండి అతని ముందు నిలిచి అతను నడవవలసిన బాట ఏదో, అతను చేరవలసిన గమ్యమేదో విడమరచి చెబుతూ వచ్చాయి. అలాంటి ఆదర్శాలు మనిషిఅన్నవాడు నివసించిన ప్రతి భూభాగంలోనూ ప్రభవించాయి. దైవమార్గాన్ని తోటి మానవసోదరులకు బోధించాయి. అలాంటి అంతిమ ఆదర్శం మహనీయ ముహమ్మద్ (స)లో మనకు దర్శనమిస్తుంది. మానవాళి దైవ ప్రేమకు, దైవ భక్తికి ప్రతిరూపంగా నిలవాలంటే ఆయన్ని అనుసరించడం తప్ప గత్యంతరం లేదు.

ప్రవక్తా! ప్రజలకు చెప్పివెయ్యండి, "మీరు నిజంగానే దైవాన్ని ప్రేమించేవారయితే నన్ను అనుసరించండి, అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు, మీ తప్పిదాలను మన్నిస్తాడు. ఆయన మహా క్షమాశీలి, కరుణా స్వరూపి". (3: 31)

చూశారా! దైవాన్ని ప్రేమించడానికి, ఆయన పట్ల భక్తీ ప్రపత్తులు కలిగి ఉండటానికి గీటురాయి ఆయన సందేశహరుని అనుసరణ అట! అంతే కాదు, దైవప్రేమకు తార్కాణంగా ప్రవక్తను అనుసరిస్తే దైవ ప్రేమ ప్రాప్తమవు తుంది. ఆయన క్షమాశీతలం లభ్యమవుతుంది. అపరాధాల ప్రక్షాళన జరుగుతుంది. ఎప్పుడూ? ప్రపంచంలో ఆచరణ రంగాన దేవుని ప్రవక్త మహనీయ ముహమ్మద్ (స)ను ఆదర్శంగా తీసుకుని అనుసరించినప్పుడు, అనుకరించి నప్పుడు.

(టిఐపి వారి 'వెన్నెల తెరలు' పుస్తకం నుండి)

ఘనమైన సంస్కృతి మనది



సంస్కృతి మానవ జీవితం నుండి విడదీయరాని అవిభాజ్య అంశం. మానవాళి ఉనికి, ఊపిరే సంస్కృతి. ఉన్నతి, ఊర్ధ్వగమన గతీ సంస్కృతి. అవనిలో అనాదిగా ప్రవహిస్తూ వస్తున్న అమృత ధార సంస్కృతి. ప్రతి పనిలో, ప్రతి కదలికలో, ప్రతి కార్యంలో ఒక ఏకీకరణ, సామూహిక అనుసరణ - సంస్కృతి.

ఏ సమాజానికైనా ఆత్మలాంటిది సంస్కృతి. యుద్ధ మైదానంలో ఓటమిని చవి చూసిన జాతి మళ్ళీ శక్తిని పుంజుకుని రణ రంగాన్ని తన కైవసం చేసుకోవచ్చేమోగానీ, సంస్కృతిని, సభ్యతను కోల్పోయిన జాతి మనుగడ మాత్రం సవ్యంగా సాగదు. ఒకసారి ఈ రంగంలో ఓడిపోతే ఇక ఊడిగమే ఆ జాతికి శాపంగా పరిణమిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలటే సంస్కృతి విహీనమై ఏ జాతి కూడా మనుగడ సాగించలేదు. అందుకే ప్రతి జాతికి, దేశానికి, ఆటవికులకు సయితం ఒక సంస్కృతి ఉండటం మనం గమనించవచ్చు.

ఇన్ని సంస్కృతుల మధ్య ఇస్లామీయ సంస్కృతీ నాగరికతలకు గల ప్రత్యేకత ఏమిటంటే- సాత్వికమైనది, సార్వజనీనమైనది ఇస్లామీయ సంస్కృతి. అది ఒక వర్గానికో, జాతికో, దేశానికో పరిమితమైనది కాదు. అది అన్ని కాలాల్లో, అన్ని ప్రాంతాల్లో సర్వాంగ సుందరమైనది, శాంతి ప్రదానమైనది. ఏకేశ్వరోపాసన (తౌహీద్) దాని పునాది. వివాహం, వ్యవహారం, వ్యాపారం, కుటుంబ జీవనం, అతిథి సత్కారం, సంస్కారం, తల్లి దండ్రుల సేవ, పెద్దల పట్ల గౌరవం, పిల్లల పట్ల అవ్యాజానురాగం, అనాథల ఆదరణ, వితంతువుల, వికలాంగుల, నిరుపేదల, అభాగ్యజీవుల సంక్షేమాభిలాష, త్యాగం, విరాగం, సార్వజనిక, సాత్విక శ్రేయోకామన ఇస్లామీయ సంస్కృతి. ఏకదైవభావన (తౌహీద్), ప్రార్థనలు, జకాతులు, రోజాలు, హజ్జ్‌లు - ధర్మ పోరాటాలు అపురూప ఇస్లామీయ సంస్కృతి. సృష్టికర్త పట్ల అపార నమ్మకం, అగోచర సృష్టిజీవులైన దైవదూతలపై విశ్వాసం, దైవగ్రంథాల మధ్య సమన్వయం, దైవ ప్రవక్తలందరి పట్ల సమరస భావం, పరలోక చింతన, స్వర్గ ప్రీతి, నరక భీతి, అదృష్టాదురదృష్టాల పట్ల విశ్వాసం ఇస్లామీయ అనుపమ సంస్కృతి. ధ్యాన లీనం, జ్ఞాన సముపార్జనం, ఖుర్‌ఆన్ పారాయణం, ఆత్మ పరిశీలన, ఆత్మ విశ్వాసం, మనో ధైర్యం ఇస్లామీయ నిరుపమాన సంస్కృతి. మంచిని బోధించటం, చెడు నుండి వారించడం, దూరంగా ఉండటం, విశ్వ జనుల్లో కాంతిని, విశ్వంలో శాంతిని నింపడం అనాదిగా ఇస్లామీయ సంస్కృతి. అది మనందరి శ్రేయోసాఫల్యం కోసం స్వయాన ఆ మాధవుడే ఎన్నుకున్న అనంత సంస్కృతి. ఆయన ఇలా సెలవిస్తున్నాడు:

"ఈ రోజు అవిశ్వాసులు మీ ధర్మం (సభ్యతా సంస్కృతిని మట్టి పాలు చేయాలన్న దుష్ట సంకల్పం) గురించి ఇక ఆశను వదులుకున్నారు. జాగ్రత్త! మీరు భయపడవలసింది వారికి (ఏ పాశ్చాత్య సంస్కృతికో, పాడుబడ్డ ఆచారానికో) కాదు, మీరు నాకు భయపడండి. ఈ రోజు మీ కొరకు (అన్నింటికన్నా శ్రేష్ఠతరమైన) మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. ఇంకా, ఇస్లాంను మీ (జీవన) ధర్మం (మీకు శాశ్వతమైన ఘనకీర్తినిచ్చే సంస్కృతి)గా సమ్మతించి ఆమోదించాను". (అల్ మాయిదా: 3)

మరో చోట ఇలా అనబడింది: "ఆయనే తన ప్రవక్తకు సన్మార్గాన్ని, సత్య ధర్మాన్ని (సంపూర్ణ సంస్కృతీ నాగరికతలను) ఇచ్చి పంపినవాడు. దాన్ని (ఇతర) మత ధర్మా (సంస్కృతీ నాగరికత) లన్నింటిపై ఆధిక్యం వహించేలా చేయడానికే (ఈ ఏర్పాటు)". (అస్సఫ్: 9)

(విడ్డూరం ఏమిటంటే) "వారు అల్లాహ్ జ్యోతి (ఇస్లామీయ సంస్కృతీ నాగరికతల)ని తమ నోళ్ళతో (కలిమి, బలిమిని ఉపయోగించి) ఊది ఆర్పివేయ దలుస్తున్నారు. (ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా) అల్లాహ్ మాత్రం తన జ్యోతిని పరిపూర్ణం గావిస్తాడు - అవిశ్వాసులకు అది ఎంతగా సహించరానిదైనా సరే!"

(అస్సఫ్: 8)

(గుర్తు పెట్టుకోవాల్సిన విషయం మరొకటుంది) "(ఓ ప్రవక్తా!) ఎవరు తమ ధర్మాన్ని ఆటగా, వినోదంగా (విలాసానిచ్చే వస్తువుగా) చేసుకున్నారో, ఎవరినయితే ప్రాపంచిక జీవితం మోసపుచ్చిందో వారికి దూరంగా ఉండు. అయితే ఈ ఖుర్‌ఆన్ ద్వారా వారికి (వారు మరచిన సభ్యతా సంస్కృతుల్ని గుర్తు చేస్తూ) ఉపదేశం మాత్రం చేస్తూ





ఉండు. ఏ వ్యక్తీ తన చేష్టల మూలంగా ఇరుక్కుపోయే దుర్గతి పట్టకుండా ఉండటానికి, అల్లాహ్ తప్ప వేరెవరూ సహాయం చేయని, సిఫారసు చేసేవాడె వడూ ఉండని దురవస్థ దాపురించ కుండా ఉండటానికి, ప్రపంచ మంతటినీ పరిహారంగా ఇచ్చి బయట పడాలని తహ తహలాడినా అది అతన్నుంచి స్వీకరించ బడని (గడ్డు) స్థితి ఏర్పడకుండా ఉండ టానికి గాను, (నీవు వారికి ఇస్లామీయ సంస్కృతీ నాగరికతలను బోధపరుస్తూ ఉండాలి సుమా!)". (అల్ అన్‌ఆమ్: 70)

(అలాగే ఈ నగ్న సత్యాన్ని సయితం వారికి బోధ పర్చు) "ఎవరయినా ఇస్లాంను కాకుండా మరో ధర్మాన్ని (సంస్కృతిని, జీవన విధానాన్ని) అన్వే షించి (మోక్షం పొందగోరి)తే అతని ఆ విధానం స్వీకరించబడదు. అలాంటి వ్యక్తి పరలోకంలో నష్టపోయినవారిలో చేరి పోతాడు". (ఆలి ఇమ్రాన్: 85)

సోదర సోదరీమణులారా!

సర్వలోక సృష్టికర్త, పోషకుడు, పాలకుడు, ఆరాధనలకు అన్ని విధాల అర్హుడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించే మహోత్కృష్ట సంస్కృతి మనది. దైవ గ్రంథాలన్నింటినీ, దైవప్రవక్తలందరిని సమానంగా గౌరవించే విశాల దృష్టి గల సముదాయం మనది. దివ్య ఖుర్‌ఆన్ విశిష్ట వచనాల్ని, అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ ﷺ వారి సుమధుర ప్రవచనాల్ని ప్రాణంగా, ప్రాణాధికంగా భావించే మహత్తర సంప్రదాయం మనది. జగమంతటినీ దైవ కుటుంబంగా, దైవ దాసులుగా అభిమానించే విశ్వజనీన సంస్కారం మనది. మంచిని పెంచి, చెడుని తుంచి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ప్రభువు ప్రసన్నతయే లక్ష్యంగా ఎంచే శ్రేష్ఠ సముదాయం మనది. ఇంటికొచ్చిన అతిథిని సతీ, సంతానం సమేతంగా పస్తులుండి మరీ సత్కరించిన త్యాగమయ సంస్కృతి మనది. ప్రాణ శత్రువుల్ని జయించి కూడా శిక్షించకుండా క్షమించి పొంగి పోయిన ఉదార సంస్కృతి మనది. అన్నం పెట్టడంలో, అనాథల్ని చేరదీయటంలో, అభాగ్యుల్ని ఆదుకోవటంలో ఆనందాన్ని ఆస్వాదించిన మహానుభావులు మన పూర్వీకులు. తల్లిదండ్రుల అనురాగ ఫలాలు, ఆశా దీపాలు, కంటి చలువలు అయిన చిన్నారుల్లో బాల్యం నుండే తౌహీద్‌ను, సాత్విక ప్రేమను, విశాల దృక్పథాన్ని నూరిపోసే ఆదర్శ సమాజం మనది. నిన్న మొన్నటి వరకు పూర్తి ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించిన ఘన కీర్తి మనది. అన్ని రంగాల్లోనూ ప్రపంచ చరిత్రపై చెరగని ముద్ర వేసిన అవిరళ కృషి మనది. లోకం మొత్తానికి మానవత్వ పాఠాలు బోధించిన ఉత్తమ రివాజు మనది. బాధిత జనాల పక్షం వహించి, దౌర్జన్యపరులను ప్రతి ఘటించిన అత్యుత్తమ చరిత్ర మనది. ఇన్ని విశిష్ఠతలు, విశేషాలు గల మన సముదాయం గత కొన్నేళ్ళుగా నిద్రా వస్థలో పడి కొట్టుమిట్టాడుతుండటం కడు శోచనీయం! మన ప్రస్తుత పరిస్థితి మిక్కిలి విచారకరం!!

మన శత్రువుల కుహకాల వల్లనే, కుతంత్రాల మూలంగానే ఇలా జరిగిందని కొందరు వాగ్వివాదానికి దిగొచ్చు. నిజమే. ప్రవక్త నూహ్‌కు, ఇబ్రాహీమ్‌కు, మూసాకు, యహ్యాకు, ఈసాకు ﷺ, అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స)కు కూడా శత్రువులుండే వారు. మనకన్నా పెద్ద శత్రువులు ఉండేవారు. అందువల్లే

ప్రవక్త జకరియ్యా రంపంతో రెండుగా చీల్చివేయబడ్డారు. యహ్యా వధించ బడ్డారు. ఈసా వేధింప బడ్డారు. ముహమ్మద్ ﷺ బాధించ బడ్డారు. వీరి శత్రువులు మన శత్రువుల కన్నా పాషాణ హృదయులు.

ఆ మాట కొస్తే శత్రువులు లేనివారంటూ ఈ ప్రపంచంలో ఎవరూ ఉండరు. ఎక్కువ విజయాలు సాధించినవారికి శత్రువులు కూడా ఎక్కువగానే ఉంటారు. ఎందుకంటే - గెలుపు - అది ఆర్థిక పర మైనదైనా, ఆధ్యాత్మికమైనదైనా, విద్యా విషయకమైనదైనా, వైజ్ఞానికమైనదైనా, సాంకేతికమైనదైనా మరింత మంది శత్రువుల్ని ప్రోగు చేస్తుంది. అయితే ఇంత మంది శత్రువుల మధ్య ఉంటూనే విజయం సాధించడాన్ని, రాజ్యాల్ని, మనుషుల్ని కాకుండా మనసుల్ని, హృద యాల్ని ఏలడాన్ని ఇష్టపడతారు పురుషోత్త ములు, అందులోనే నిరతం శ్రమైకానం దాన్ని పొందుతుంటారు. కాబట్టి వారి జీవితాలు ఒక ఛాలెంజీ, ఛేంజీయే మనకు ప్రవక్తల జీవితాల్లో ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తూ కన్పిస్తుంది. ఈ సత్యాన్ని గ్రహించిన, ఈ ఆదర్శాన్ని అనుసరించిన వ్యక్తి - సాకులు వెతకడం మానుకుని శ్రమకి, సాధనకి, కృషికి ప్రాధాన్యత నిస్తాడు. కారణం - 'కృషి ఉంటే మనుషులు కూడా ఋషులవుతారు' అన్నది అతను నమ్మిన సిద్ధాంతం.

(మిగతాది 19 వ పేజీలో)

మూలం:
షేఖ్ అబూ బకర్ నజ్జార్

ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)

బాబిలోనియా ప్రజలు సెమెటిక్ జాతికి చెందిన ప్రజలు. భోగభాగ్యాల జీవితం గడిపేవారు. విగ్రహాలను చెక్కి వాటిని పూజించేవారు.

కనాన్ కుమారుడు నమ్రూద్ వారి పాలకుడు. పరమ స్వార్థపరుడు. నిరంకుశుడైన నియంత. ప్రజలను బెదిరించి, భయపెట్టి తన చెప్పుచేతల్లో ఉంచుకున్నాడు. తన పాలనలో ప్రజలు భోగ భాగ్యాలతో జీవిస్తున్నారన్న విషయం నమ్రూద్‌కి బాగా తెలుసు. ప్రజలు విలాసవంతమైన జీవితం తప్ప మరేదీ పట్టించుకోరని కూడా అతనికి తెలుసు. ప్రజలు ఆరాధిస్తున్న విగ్రహాలకన్నా తానే గొప్పవాడని భావించాడు. ఎందుకంటే విగ్రహాలు కనీసం చూడలేవు, వినలేవు, ఆలోచించలేవు, అనుభూతి చెందలేవు, ఎవరికీ రక్షణ కల్పించలేవు, ఎవరినీ సంపన్నులుగా లేదా నిరుపేదలుగా మార్చలేవు, కాని తాను ఎవరినైనా ఏమైనా చేయగల అధికారాలు కలిగినవాడు. ఈ ఆలోచన కలిగిన వెంటనే నమ్రూద్ తానే అసలైన దేవుడినని ప్రకటించుకున్నాడు. విలాసవంతమైన జీవితం గురించి తప్ప మరి దేని గురించీ పట్టించుకోని ప్రజలు అతడు చెప్పినట్లు అతనే దేవుడని ఒప్పుకున్నారు.

ఈ నేపథ్యంలో పద్దాన్ అరమ్ అనే పట్టణంలో ఇబ్రాహీమ్ (అ) జన్మించారు. అల్లాహ్ ఆయనకు వివేకాన్ని, విజ్ఞతను, వివేచనను ప్రసాదించాడు. ఆయనకు సత్యమార్గాన్ని చూపించాడు. ఇబ్రాహీమ్ (అ) ప్రజలకు నిజమైన దేవుడిని ఆరాధించాలని బోధించడం ప్రారంభించారు. ఏకైక దేవుడైన అల్లాహ్‌నే ఆరాధించాలనీ, విగ్రహాలను ఆరాధించడంలో విజ్ఞత లేదని ప్రచారం చేయసాగారు.

ఇబ్రాహీమ్ (అ) అల్లాహ్ పట్ల దృఢమైన విశ్వాసం కలిగినవారు. సృష్టికర్త అయిన అల్లాహ్ సర్వశక్తిమంతుడన్న బలమైన నమ్మకం కలిగినవారు. తనకు అల్లాహ్ తరఫున అందిన సందేశాన్ని హృదయపూర్వకంగా విశ్వసించేవారు. మనుష్యులందరూ మరణానంతరం ఒక రోజు మళ్ళీ బ్రతికించబడతారనీ, వారు తమ కర్మలకు జవాబు చెప్పుకోవలసి ఉంటుందని పూర్తి విశ్వాసం కలిగినవారు. అయితే ఆయనకు మరణానంతరం మనిషి మళ్ళీ ఎలా బతుకుతాడో కళ్ళారా చూడాలన్న కుతూహలం ఉండేది.

పక్షుల మహత్యం

ఆయన అల్లాహ్‌ని వేడుకుంటూ మరణానంతరం మళ్ళీ లేపబడడం అన్నది ఎలా జరుగుతుందో చూపించాలని ప్రార్థించారు. నాలుగు పక్షులను పట్టుకుని వాటిని కోసి, వాటి శరీర భాగాలను కలగలపమని అల్లాహ్ ఆయన్ను ఆదేశించాడు. అలా కలగలిపిన శరీర భాగాలను నాలుగు వాటాలుగా చేసి వాటిని వేరు వేరు కొండలపై పెట్టాలని నిర్దేశించాడు. ఆ పిదప ఆ పక్షులను దేవుని పేరుతో పిలవాలని చెప్పాడు. ఇబ్రాహీమ్ (అ) దేవుని ఆదేశం ప్రకారం చేశారు. ఆయన పిలిచిన వెంటనే కలగలిపిన శరీరభాగాలు ఏ పక్షివి ఆ పక్షివిగా వేరు పడ్డాయి. పక్షులు బ్రతికి ఎగిరి వచ్చాయి. అలాంటి అద్భుతమైన మహిమ చూసిన వ్యక్తికి మనిషి మరణానంతరం మళ్ళీ లేపబడతాడన్న విషయంలో ఎలాంటి సందేహం ఉండే ఆస్కారమే లేదు. అయితే అల్లాహ్‌కు ఏది చేయడమైనా కష్టం కాదు. ఆయన ఏదయినా చేయదలిచితే "అయిపో" అంటాడు. అంతే ఆ పని అయిపోతుంది. (దివ్య ఖుర్‌ఆన్ 2: 260).

తండ్రీ కుమారుల వాగ్వివాదం

ఇబ్రాహీమ్ (అ) తండ్రి పేరు ఆజర్. అతను విగ్రహారాధకుడు మాత్రమే కాదు, విగ్రహాలను చెక్కి అమ్మేవాడు. ఒక మంచి కుమారుడిగా తాను తన తండ్రికి ఈ పనిలోని అనౌచిత్యం గురించి చెప్పడం తన బాధ్యతగా ఇబ్రాహీమ్ (అ) భావించారు. ఆ విధంగా తన తండ్రిని అల్లాహ్ ఆగ్రహం నుంచి కాపాడాలనుకున్నారు. కాని ఈ విషయాన్ని చాకచక్యంగా, తండ్రి బాధపడకుండా చెప్పాలనుకున్నారు. ఆయన తన తండ్రి ఆరాధిస్తున్న విగ్రహాల విషయంలో ఎగతాళి చేయలేదు. తండ్రి పట్ల తనకున్న ప్రేమను తెలియజేసి ఆ విధంగా తండ్రిలో ప్రేమాభిమానాలను ప్రేరేపించి తన మాటలను తండ్రి శ్రద్ధగా వినేలా చేసుకున్నారు. ఆ తర్వాత నెమ్మదిగా చెప్పారు. జీవంలేని విగ్రహాలను ఎందుకు పూజిస్తున్నారని ప్రశ్నించారు. వినలేని, చూడలేని, కాపాడలేని విగ్రహాలను పూజించడం ఎందుకని అడిగారు. తండ్రికి కోపం రాక ముందే, "నాన్నా! మీకు తెలియని జ్ఞానం నా వద్దకు వచ్చింది. నన్ను అనుసరించడం చిన్నతనం అవుతుందని దయచేసి భావించవద్దు. మీ అనుభవంకానీ, మీ వయస్సు కాని నాకు లేవన్న సంగతి నాకు బాగా తెలుసు. కాని షైతాన్ మానవాళికి

శత్రువు, మనిషిని దారి తప్పించి దర్మార్గానికి పాల్పడేలా చేస్తాడు" అన్నారు. కుమారుడు నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా చెబుతున్న ఈ మాటలు విని ఆ తండ్రి ఆశ్చర్యపోయాడు. కుమారుడితో మాట్లాడుతూ, "నీవు నా దేవుళ్ళను కాదంటున్నావా? ఇబ్రాహీమ్! నువ్వు అలా చేస్తే నేను నిన్ను రాళ్ళతో కొట్టిస్తాను. నా కోపం నీకు తెలుసు. ఒక తండ్రి మాదిరిగా దయాగుణాన్ని నువ్వు నాలో చూడలేవు. ఇక నన్ను ఒంటరిగా వదిలేయ్!" అన్నాడు. (అంటే ఇబ్రాహీమ్ ﷺ తన ఇల్లు వదలిపోవాలని పరోక్షంగా సూచించాడు).

ఇబ్రాహీమ్ ﷺ మౌనంగా ఊరుకున్నారు. అయితే తండ్రికి నచ్చజెప్పడం మానుకోలేదు. "మీకు శాంతి కలుగుగాక! మీ కోసం నా ప్రభువుతో క్షమాభిక్ష అర్థిస్తాను. అల్లాహ్ అనంత కరుణామయుడు. మీకూ, మీరు ఆరాధిస్తున్న వాటికి నేను దూరంగా వెళ్ళక తప్పదు" అన్నారు. తన తండ్రికి వీడ్కోలు చెప్పి భారమైన మనసుతో ఇల్లు వదలి వెళ్ళిపోయారు.

సంవాదం

తండ్రి కఠినంగా వారించినా ఇబ్రాహీమ్ ﷺ తన సత్యసందేశ ప్రచారాన్ని మానుకోలేదు. ప్రజలు ప్రాణం లేని విగ్రహాల ముందు సాష్టాంగ పడడం చూసి ఆయన చాలా బాధపడే వారు. ఈ ఆచారాన్ని మానిపించాలని ఆయన తీర్మానించుకున్నారు. ఈ విషయమై ప్రజలతో వాదించడానికి సిద్ధపడ్డారు. ఇలాంటి వాదనల వల్ల తనకు ప్రమాదమని తెలిసినా ఆయన వెనుదీయలేదు.

ఒక వైద్యుడు తగిన చికిత్స కోసం సూచించడానికి రోగ నిర్ధారణకు పరీక్షలు చేసినట్లుగా, ఒక న్యాయవాది నిందితుడిని ప్రశ్నించి సత్యాన్ని రాబట్టడానికి ప్రయత్నించినట్లుగా ఇబ్రాహీమ్ ﷺ ప్రజలను ప్రశ్నించారు. "మీరు సాష్టాంగ పడినప్పుడు ఈ విగ్రహాలు మిమ్మల్ని చూస్తాయా? మీకు ఏ విధంగానయినా ఇవి ప్రయోజనం కలిగిస్తాయా?" అని అనేవారు.

ప్రజలు ఆయనకు జవాబిస్తూ, విగ్రహాలకు ప్రాణం లేదన్న వాస్తవం తమకు కూడా బాగా తెలుసనీ, కాని తమ తాత ముత్తాతలు వాటిని పూజించారనీ, విగ్రహాల శక్తిసామర్థ్యాలకు ఇంతకన్నా రుజువు ఏం కావాలని అన్నారు.

మీ తాతముత్తాతలు తప్పు చేశారని ఇబ్రాహీం ﷺ వారికి నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. ఈ మాటలు విన్న ప్రజలు ఆగ్రహంతో మండిపడ్డారు. "నువ్వు మా దేవుళ్ళను, మా తాత ముత్తాతలను నిందిస్తున్నావా? లేక పరిహాసానికి చెబుతున్నావా?" అని నిలదీశారు. ఇబ్రాహీమ్ ﷺ ఎలాంటి సంకోచం లేకుండా తాను పరిహాసం చేయడం లేదని, సత్యం చెబుతున్నాననీ, తాను ఒక సత్యమైన ధర్మం తీసుకువచ్చాననీ, అందరి ప్రభువైన అల్లాహ్ తనకు మార్గదర్శకత్వాన్ని ఇచ్చి పంపాడనీ, అల్లాహ్ ఒక్కడే ఏకైక దేవుడనీ, ఆయనే సృష్టికర్త అనీ, భూమ్యాకాశాలను సృష్టించింది ఆయనే ననీ, ఆయనే జీవన వ్యవహారాలన్నింటినీ నడుపుతున్నాడనీ, కేవలం కలప, రాళ్ళతో చేసిన ఈ విగ్రహాలు కాదని నిర్మొహమాటంగా చెప్పారు. ఈ విగ్రహాలు తనకు ఎలాంటి హాని చేయలేవని వారికి నచ్చచెప్పడానికి ఆయన వారితో సవాలు చేశారు. "నేను విగ్రహాలను బాహాటంగా విమర్శించాను. వాటికి నిజంగా శక్తి ఉంటే ఈ పాటికి అవి నాకు హాని కలిగించి ఉండేవి" అన్నారు.

అల్లాహ్ సృష్టిలోని సౌందర్యాన్ని ఇబ్రాహీమ్ ﷺ వారికి వివరించారు. అల్లాహ్ శక్తి సామర్థ్యాలను, అల్లాహ్ వివేక విజ్ఞతలను తెలియజేశారు. విగ్రహారాధనను అల్లాహ్ ఏవగించుకుంటాడనీ, ఈ సమస్త విశ్వానికి అల్లాహ్ మాత్రమే నిజమైన ప్రభువనీ, తనకు అన్నపానీయాలు కల్పిస్తున్నాడనీ, జబ్బు పడినప్పుడు స్వస్థత ఇస్తున్నాడనీ, ఆయనే మృత్యువును ఇస్తాడనీ, తర్వాత మళ్ళీ బ్రతికించి లేపుతాడని వివరించారు. తాను ఆయన్నే ఆరాధిస్తున్నాననీ, ఆయనే తీర్పు దినాన తన తప్పులను మన్నిస్తాడని చెప్పారు. కాని ప్రజలు ఈ వాస్తవాలను గుర్తించకుండా విగ్రహారాధన కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విగ్రహాల యుద్ధం

పట్టణానికి బయట ఒక ఉత్సవం జరుపుకునే సంప్రదాయం వారికి ఉండేది. అయితే ఆ ఉత్సవానికి వెళ్ళే ముందు విగ్రహాలకు ప్రసాదాలు పెట్టి వాటి ఆశీర్వాదం తీసుకుని వెళ్ళేవారు. ఉత్సవం నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఆ ప్రసాదాన్ని పంచుకు తినేవారు. ఇబ్రాహీమ్ ﷺ వారితోపాటు ఉత్సవానికి రానన్నారు. పట్టణంలోనే ఉండిపోయారు. ప్రజలం దరూ ఊరి బయట ఉత్సవంలో పాల్గొన టానికి వెళ్ళారు. పూజారులు కూడా వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఇబ్రాహీమ్ ﷺ విగ్రహాలున్న ఆలయంలో ప్రవేశించారు. చాలా విగ్రహాల పాదాల వద్ద ఆహార పదార్థాలు ఉన్నాయి. ఇబ్రాహీమ్ ﷺ విగ్రహాలను భోంచేయడం లేదేమని వ్యంగ్యంగా అడిగారు. కోపంగా ఆ విగ్రహాలన్నింటినీ విరగ్గొట్టారు. ఒకదాని తర్వాత ఒకటిగా విగ్రహాలన్నింటినీ ముక్కలు చేసి ఒక పెద్ద విగ్రహాన్ని మాత్రం వదిలేశారు. అప్పటికిగానీ ఆయన కోపం చల్లార లేదు. పూజారులు, ప్రజలు తిరిగి వచ్చి విగ్రహాలన్నీ ధ్వంసమై ఉండటం చూసి నిర్ఘాంతపోయారు. ఇలాంటి పని చేసేది ఇబ్రాహీమ్ తప్ప మరెవరూ కాదని నిర్ణయించారు. ఆగ్రహంగా ఇబ్రాహీమ్‌ను బంధించి విచారణ జరపాలన్నారు. ఇబ్రాహీమ్ ﷺ కూడా అందుకు ఒప్పుకున్నారు. ఆయన కూడా విచారణ జరగాలనే కోరుకున్నారు. బహిరంగంగా విచారణ జరిగితే ప్రజలకు వారి మూర్ఖ ఆచారాల గురించి బాహాటంగానే వివరించవచ్చని ఆయన భావించారు.

విచారణ

విచారణలో ఇబ్రాహీమ్ ﷺను విగ్రహాల విధ్వంసం గురించి ప్రశ్నించారు.

విగ్రహాలను విరగ్గొట్టింది నీవేనా అని అడిగారు. ఇబ్రాహీమ్ (అ) నవ్వుతూ, విరక్కుండా ఉన్న పెద్ద విగ్రహాన్ని అడిగితే చెబుతుంది కదా అన్నారు. అసలు ఆ పెద్ద విగ్రహమే మిగిలిన విగ్రహాలను విరగ్గొట్టి ఉంటుంది అని కూడా చెప్పారు. ఈ మాటలు విన్న వాళ్ళు కోపంతో, విగ్రహాలు మాట్లాడవని నీకు తెలియదా? అన్నారు. ఈ జవాబు కోసమే ఎదురు చూస్తున్న ఇబ్రాహీమ్ (అ) ప్రాణం లేని వాటిని పూజించటం ఎంత నిష్ప్రయోజనకరమో వారికి వివరించారు.

తమ విశ్వాసాలలోని నిర్హేతుకతను వాళ్ళు కూడా గుర్తించారు. కాని వారి అహంకారం సత్యం అంగీకరించకుండా అడ్డుపడింది. తమ బలాన్ని ప్రదర్శించడం తప్ప వారు మరో జవాబు ఇవ్వలేక పోయారు. సాధారణంగా నియంతలు చేసే పనే ఇది. వారు ఇబ్రాహీమ్ (అ)ను సంకెళ్ళతో బంధించి ప్రతీకారం తీర్చుకునే పథకం వేశారు. **(చదవండి దివ్య ఖుర్‌ఆన్: 21: 52-68, 26: 69-102, 29: 16,17, 34)**

అగ్ని గుండం

వారి గుండెల్లో కోపం బుసలు కొట్ట సాగింది. ఇబ్రాహీమ్ (అ)ను ఒక పెద్ద అగ్ని గుండంలో విసిరివేయాలని నిర్ణయించారు. తమ దేవుళ్లకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకునేందుకు ప్రజలందరూ కట్టెలు సమీకరించాలని ఆదేశించడం జరిగింది. అజ్ఞానంతో కొందరు వ్యాధి గ్రస్తులైన మహిళలు, తమ వ్యాధి తగ్గిపోతే తాము సాధ్యమైనంత ఎక్కువ కలప ఇబ్రాహీమ్ (అ) దహనానికి ఇస్తామని మొక్కుకున్నారు. అనేక రోజుల పాటు వారు కట్టెలు, కలప సేకరించారు. ఆ తర్వాత వాళ్ళు మహా అగ్ని గుండాన్ని వెలిగించారు. ఆ మహా అగ్ని గుండం భగభగ మండసాగింది. ఆ మంట నుండి వచ్చిన భీకర ధ్వని చాలా దూరం వరకు వినిపించసాగింది. అందులో నిప్పులు ఎర్రగా మండసాగాయి. వాళ్ళు ఇబ్రాహీమ్ (అ)ను తాళ్ళతో కట్టేసారు. ఆయన్ను అగ్ని గుండంలోకి విసరి వేశారు. నల్లని దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని ఆవరించుకుంది.



ఆ అగ్ని గుండం చల్లారి, పొగ తగ్గిన తర్వాత వాళ్ళు అందులో చూసి దిగ్భ్రాంతి చెందారు. అందులో నుంచి ఒక వ్యక్తి ఒంటరిగా బయటకు వస్తున్నాడు. తన స్నేహితునిగా అభివర్ణించిన ఇబ్రాహీమ్(అ)ను విశ్వ ప్రభువైన అల్లాహ్ కాపాడాడు. భగభగలాడే అగ్ని కీలలు ఇబ్రాహీమ్ (అ)కు పూల మాలల్లా స్వాగతమిచ్చాయి. ఆయనకు కట్టి ఉన్న త్రాళ్ళను మాత్రమే దహించాయి. ఈ మహత్యాన్ని చూసి నిరంకుశ పాలకుడు సిగ్గు పడ్డాడు. కాని వారి మనస్సుల్లో ఉన్న ఆగ్రహ జ్వాలను ఇది చల్లార్చలేక పోయింది. అయితే ఈ మహత్యాన్ని చూసిన తర్వాత చాలా మంది ఇబ్రాహీమ్ (అ) సందేశాన్ని విశ్వసించారు. కొందరు తమ విశ్వాసాన్ని రహస్యంగా ఉంచారు. నిరంకుశుడైన పాలకుడు తమను హతమార్చ వచ్చని లేదా తమకు హాని కలిగించవచ్చని వారు భయపడ్డారు.

తన్ను తాను దేవుడిగా ప్రకటించుకున్న నమ్రూద్ తన దైవత్వానికి ప్రమాదం వచ్చిందని భయపడ్డాడు. అదీ ఒక సాధారణ మానవుడైన ఇబ్రాహీమ్ (అ) వల్ల ఆ ప్రమాదం ముంచుకొస్తుందని ఆందోళన చెందాడు. ఇబ్రాహీమ్ (అ)ను తన రాజభవనానికి పిలిచి తీవ్రంగా హెచ్చరించాడు. "నువ్వు నా ప్రజల్లో అలజడి సృష్టిస్తున్నావు. నన్ను మించిన దేవుడెవడూ లేడు" అన్నాడు. ఇబ్రాహీమ్ (అ) జవాబిస్తూ "జీవన్మరణాలు ప్రసాదించేవాడే నా ప్రభువు. ఆయనే ఈ సమస్త విశ్వానికి సృష్టికర్త" అన్నారు. ఈ మాటలు విన్న నమ్రూద్ తన గొప్పదనాన్ని చూపించటానికి, "నేను కూడా జీవితాన్ని ప్రసాదిస్తాను. నేను తలచినవారిని ప్రాణాలతో వదిలేస్తాను. నేను తలచిన వారిని చంపించగలను. కాబట్టి నీ ప్రభువు చేసే పని ప్రత్యేకమైన దేం కాదు" అన్నాడు.

ఇబ్రాహీమ్ (అ)నవ్వుతూ తలాడించారు. "నా ప్రభువు సూర్యుడిని తూర్పు నుంచి ఉదయించేలా చేస్తున్నాడు. పడమట అస్తమించేలా చేస్తున్నాడు. నువ్వు దేవుడివైతే ఈ క్రమాన్ని మార్చి చూపించు" అన్నారు. ఈ మాటలు విన్న నమ్రూద్ నోరెళ్లబెట్టాడు. అతడి మూర్ఖపు వాదన తేట తెల్లమైపోయింది. అందరి ముందు సిగ్గుపడే పరిస్థితి ఏర్పడింది. కాని ఇబ్రాహీమ్ (అ)ను బహిరంగంగా చంపించడానికి భయపడ్డాడు. చాలా మంది దీనివల్ల తనకు వ్యతిరేకులై పోతారనీ, తనకు శత్రువులైపోతారని భయపడ్డాడు. అందువల్ల ప్రజల్లోకి తన మనుష్యులను పంపించి ఇబ్రాహీమ్ (అ)ను అనుసరిస్తే వారికి తీవ్ర పరిణామాలు తప్పవనీ, మరణ శిక్ష విధించడం కూడా జరుగుతుందని హెచ్చరికలు జారీ చేయించాడు.

ఆ పట్టణంలో తన సందేశాన్ని స్వీకరించేవారు ఇంకెవరూ లేని పరిస్థితిని గమనించిన ఇబ్రాహీమ్ (అ) అక్కడి నుండి తరలిపోయారు.

(చదవండి దివ్యఖుర్‌ఆన్ 2: 258)




ఖగోళాలను ఆరాధించే ప్రజలు

ఇబ్రాహీమ్ (అ) అక్కడి నుంచి హర్రాన్ అనే ప్రదేశానికి వచ్చారు. ఈ ప్రదేశం ఫలస్తీనాకు దగ్గరగా ఉంది. అక్కడే ఆయన స్థిరపడ్డారు. అక్కడి ప్రజలు తెలివి

గలవారని విన్నారు. ప్రకృతిలోని వింతలను పరిశీలించడం వారికి చాలా ఇష్టమని కూడా గ్రహించారు. తన సందేశాన్ని స్వీకరించేవారు ఇక్కడ లభిస్తారని ఆశించారు. అయితే అక్కడి ప్రజలు ఖగోళాలను పూజించడం కన బడింది. కాని ఆ ప్రజలు ఆలోచించే, పరిశీలించే అలవాటు కలిగిన ప్రజలు కాబట్టి హేతుబద్ధమైన వాదనతో వారిని మార్చవచ్చని ఆయన భావించారు. ఒక రాత్రి నక్షత్రాలు మిలమిలలాడుతున్నప్పుడు ఆయన వాటిని చూపించి, "అదే నా ప్రభువు" అని బిగ్గరగా పలికారు. కాని ఆ నక్షత్రాలు కనుమరుగై పోయిన తర్వాత, "అరె" నా ప్రభువు ఎక్కడి కెళ్ళాడు?" అని బిగ్గరగా పలికారు. ఇది విన్న ప్రజలు నక్షత్రాలు అస్తమించాయని అన్నారు. ఆ మాట విన్న ఇబ్రాహీమ్ (అ), "ఇలా కనుమరుగయ్యేవాడు నా దేవుడు కాదు" అన్నారు.

చంద్రుడు, పెద్దగా ప్రకాశవంతంగా కనబడటాన్ని చూసి ఆయన, "ఇదే నా ప్రభువు కావచ్చు" అని బిగ్గరగా పలికారు. కాని చంద్రుడు కూడా అస్తమించాడు. ఇది చూసి ఇబ్రాహీమ్ (అ) నా ప్రభువు నాకు మార్గదర్శకత్వాన్ని ఇచ్చి ఉండ నట్టయితే నేను కూడా దారి తప్పే వాడిని" అన్నారు. ఉదయం సూర్యుడు ఉదయించాడు. ఇది చూస్తూ ఇబ్రాహీమ్ (అ), ఇది తప్పక నా ప్రభువై ఉండాలి. ఇది చాలా పెద్దగా ఉంది,. చాలా తీక్షణమైన ప్రకాశం కలిగి ఉంది. కాబట్టి మరింత ప్రయోజన కరమైనది" అన్నారు. కాని సూర్యుడు కూడా అస్తమించడాన్ని చూసి "నిస్సందేహంగా ఈ ఖగోళాలు అన్నీ కూడా ఒక విశ్వ ప్రభువు ఆదేశాల ప్రకారం నడుచుకుంటున్నాయి" అని బిగ్గరగా పలికారు. ఈ విధమైనటువంటి హేతుబద్ధమైన మాటలు ప్రజల మనో మస్తిష్కాలపై పని చేస్తాయనీ, వారు సత్యాన్ని గ్రహిస్తారనీ ఆయన ఆశించారు. కాని ఆయన ఎంత ప్రయత్నించినా వాళ్ళు ఒకే దేవుడన్న విశ్వాసానికి రాలేదు. వారు అల్లాహ్ శిక్షకు భయపడలేదు. వారి వైఖరి వారిని నరకానికి తీసుకుపోతుందని ఇబ్రాహీమ్ (అ) వారిని హెచ్చరించారు.

(దివ్య ఖుర్‌ఆన్ 6: 74-83)



ఈజిప్టు యాత్ర

ఫలస్తీనాలో కరవు ఏర్పడింది. ఫలితంగా జీవితం దుర్భరమైపోయింది. ఇబ్రాహీమ్ (అ) తన భార్యను తీసుకుని ఈజిప్టు వలస వెళ్ళారు. ఇబ్రాహీమ్ (అ) గొప్ప తనాన్ని గ్రహించిన అక్కడి రాజు ఆయన గౌరవార్థం తన వద్దనున్న ఒక సేవకురాలు హాజిరాను కానుకగా ఇచ్చాడు.

పలస్తీనాకు తిరిగి రావడం

ఇబ్రాహీమ్ (అ) ఈజిప్టులో చాలా కాలం ఉన్నారు. అక్కడ ఆయన చాలా కష్టపడి పని చేయడం వల్ల సంపన్నులయ్యారు. అయితే జీవితంలో విజయాలు సాధించిన వ్యక్తి ఇతరుల ఈర్ష్యాసూయలను కూడా ఎదుర్కొవలసి వస్తుంది. తన పట్ల ప్రజల్లో ఒక విధమైన అసూయ ఉందని గుర్తించిన ఇబ్రాహీమ్ (అ) తన భార్య సారాను, సేవకురాలు హాజిరాను తీసుకుని అక్కడి నుంచి పలస్తీనాకు తరలి వచ్చారు.



ప్రవక్త ఇస్మాయీల్ (అ)

పలస్తీనాలో ఇబ్రాహీమ్ (అ) సందేశాన్ని కొందరు విశ్వసించారు. సత్య సందేశాన్ని స్వీకరించారు.

సారాకు సంతానం కలుగలేదు. ఆమెకు వయసు పైబడింది. పిల్లలు కలిగే వయసు దాటిపోయింది. తన భర్తకు ఒక పిల్ల వాడిని ఇవ్వలేకపోయానని ఆమె బాధ పడేవారు. అందువల్ల తమ సేవకురాలు హాజిరా హాజిరాను పెళ్ళి చేసుకోవలసిందిగా ఆమె భర్తను కోరారు. ఇబ్రాహీమ్ (అ) ఈ సలహా మన్నించి హాజిరాను వివాహం చేసుకున్నారు. హాజిరాకు ఒక కుమారుడు, ఇస్మాయీల్ (అ) జన్మించారు. ఇబ్రాహీమ్ (అ) చాలా సంతోషించారు. ఇస్మాయీల్ (అ)ను అమితంగా ప్రేమించారు.

సహజమైన ఈర్ష్యాసూయలు

మొదట్లో సారా కూడా ఇబ్రాహీమ్ (అ) సంతోషంలో పాలు పంచుకున్నారు. కాని తర్వాత తన భర్త కొత్తగా జన్మించిన శిశువు పట్ల, శిశువు తల్లి అయిన హాజిరా పట్ల అధిక శ్రద్ధ చూపటం ఆమెలో ఈర్ష్యాసూయలకు కారణమయ్యింది. ఆమెలో అసూయ బుసలు కొట్టింది. వారిద్దరిని ఎక్కడైనా దూరంగా విడిచి రావలసిందిగా ఆమె భర్తను కోరారు. సారా కోరినట్లు చేయవలసిందిగా అల్లాహ్ ఇబ్రాహీమ్ (అ)కు సూచించారు. ఆయన ఎక్కడికి వెళ్లవలసింది దేవుడు స్వయంగా మార్గం చూపిస్తానన్నాడు. అనేక రోజులు ప్రయాణించిన తర్వాత, భయంకరమైన ఎడారిని దాటిన తర్వాత, ఒక నిర్మానుష్యమైన ప్రదేశం వద్ద వారు విడిది చేశారు. అక్కడ చెట్టు చేమ మచ్చుకు కూడా లేవు. నీటి బొట్టు కూడా దొరకని నిర్జనమైన ప్రదేశం అది. ఆ ప్రదేశంలోనే ఇబ్రాహీమ్ (అ) తన భార్యాపిల్లలను వదలి వెళ్ళాలని దేవుడు ఆజ్ఞాపించాడు. ఇబ్రాహీమ్ (అ) తన భార్యకు కొన్ని ఎండు ఫలాలు, కొంత నీరు, ఒక గుడారం, మరికొన్ని వస్తువులు ఇచ్చి బరువైన మనసుతో విచారంగా అక్కడి నుంచి వెనుదిరగడానికి తన ఒంటెను అధిరోహించారు. హాజిరా ఆ ఒంటెను పట్టుకుని, "ఇబ్రాహీమ్ (అ)! మమ్మల్ని ఈ నిర్జన ప్రదేశంలో ఎందుకు వదిలేస్తున్నారు? మీకు నా పట్ల ఎలాంటి అభిమానం లేకపోయినా కనీసం మీ కన్నబిడ్డ గురించి ఆలోచించండి. మీ కుమారుడు ఇక్కడ ఆకలి దప్పులతో ప్రాణం వదిలేయవచ్చు. ఇక్కడ క్రూర మృగాలు మాపై దాడి చేయవచ్చు" అని వేడుకున్నారు. ఇబ్రాహీమ్ (అ) ఎడారి వైపు చూస్తూ, సహనం వహించాలని ఆమెతో చెప్పారు. తాను తన ఇష్టప్రకారం వ్యవహరించడం లేదని, కేవలం అల్లాహ్ ఆదేశాలను అమలు చేస్తున్నాననీ జవాబిచ్చారు. ఆయన జవాబు ఆమెకు ఊరట కలిగించింది. కన్నీళ్ళు తుడుచుకుంటూ, "ఇది అల్లాహ్ అభీష్టమైతే ఆయన మమ్మల్ని ఒంటరిగా వదలిపెట్టడు" అన్నారు.

(ఇంకా ఉంది)

సయ్యద్ అబ్దుస్సలాం ఉఫీ
abdussalamsyed@ymail.com



తూరుపు దిక్కున సూరీడు తలుపు తోసుకుని వస్తున్నాడు

నిశ్శబ్ద నిశి రాత్రి సమయాన పున్నమి చంద్రునిలా పండు వెన్నెల్ని వెదజల్లుతూ ప్రవక్త (ﷺ) వారు యస్రిబ్ ప్రాంతం వైపు పయనిస్తున్నారు... 'పువ్వులు పుట్టగానే పరిమళిస్తాయి. పరిమళించగానే పరగణా అంతా వ్యాపిస్తాయి' అన్నట్టు ప్రవక్త (ﷺ) వారి సుగుణాల సుగంధ మల్లెల గుభాళింపులు ఈ పాటికే మదీనా చేరుకున్నాయి...అవునవును...'రాకమానదు జాబిల్లి...తొలిగిపోక మానదు చీకటి, చూడు మళ్ళీ' అని భువన గగనాలు భవిష్య వాణి వినిపిస్తున్నాయి...!!

అల్లంత దూరాన ఓ చెట్టు... ఆ చెట్టు కొమ్మన రెండు పక్షులు...చిలకా, గోరింకా.

చిలుక: అదిగో అటు చూడు! అందాల చందురూడు. సుగుణ సంపన్నుడు. ప్రేమామృతాలు నిండిన నిజాయితీపరుడు... అహో! ఏమి సౌందర్యము!! అతిలోక సుందర ముఖారవిందుడై, రత్న ప్రభాకరుడై, క్రాంతి కారుడై, శాంతి రూపుడై, సత్య సంధుడై, అదిగో... ఇటే వస్తున్నాడు.

గోరింక: ఎవరీ సుందర పురుషోత్తముడు! ఈ మహా మహిమాన్వితుడేనా అంతిమ దైవ ప్రవక్తంటే! ఈ మహోజ్వల రూపుడేనా అమీన్, సాదిఖ్ అంటే! దేదీప్యమానంగా కాంతుల్ని విరజిమ్ముతున్న ఆయన వదనం ఎంత మనోహరం! కాంతులీనుతున్న ఆయన ఆకారం ఎంత సుందరం! ఆయన దేహం ఉజ్వల శరీరం! మెరిసే మేని వర్ఛస్సు, ఉజ్వలమైన ముఖార విందం! భావ్యమైన విగ్రహం, గాంభీర్యం ఉట్టిపడే నిశ్శబ్దత, ఆహ్లాదపరిచే పలుకరింపు! ఎంత మధురం ఆయన స్వరం!

ఈ భువన చందురుడే గనక ఎరుపు రంగు వస్త్రాలు ధరిస్తే - ఆ గగన చంద్రుడు కూడా సిగ్గుతో నీరైపోతాడు. ఆ దినకరుడి కన్నా తేజోవంతం ఆయన రూపం. ఆయన ముఖంపై మెరిసే చారలు మేఘాల వెండి చారలు. ఆయన హస్తాలు మృదువైన పట్టు వస్త్రాలు. ఆయన దేహపు ముచ్చెమటలు మేలి కస్తూరి సువాసనలు. గలగల పారే సెలయేరు ఆయన వ్యక్తిత్వం. అదిగో! ఆయన రెండు గూడల నడుమ మొహ్రె - నుబువ్వత్, పావురం గ్రుడ్డులా పైకి ఉబికి ఉంది చూడు!

గోరింక: చిలకా! ఇవ్వాళ నీవు కవిత్వం చెబుతున్నావే! నీ మాట పాటలా సాగిపోతుందే!

చిలుక: ఆ విషయంలో నీవు మాత్రం తక్కువేం కాదులే!

గోరింక: చిలకా! ఈ అగ్రజుని గురించి నాక్కూడా కాస్త చెప్పవూ ప్లీజ్!

చిలుక: అడుగు, చెబుతాను.

గోరింక: ముహమ్మద్, అహ్మద్ ఆ పేర్లకు అర్థమేమిటే చిలకా! అర్థమేమిటి?

చిలుక: అత్యంత ప్రశంసనీయుడు, అందరికన్నా అధికంగా ఆది మధ్యాంత రహితుడ్ని స్తుతించేవాడు అని అర్థమయ్యా.

గోరింక: అమీన్, సాదిఖ్‌లన్న బిరుదులు ఎలా వచ్చాయే చిలకా! ఎలా వచ్చాయి?

చిలుక: వ్యవహారంలోగాని, వ్యాపారంలో గాని ఆయన నిజాయితీని చూసి, అప్పగింతల విషయంలో ఆయన సచ్ఛీలతను చూసి జనులు ఇచ్చిన బిరుదులయ్యా ఇవి.

గోరింక: దానధర్మాల్లో ప్రభంజనం అని ఆయన్ని ఎందుకన్నారే చిలకా! ఎందుకన్నారు?

చిలుక: ఆయనది జాలి గుండె. పేదల పాలిట పెన్నిధి ఆయన. అనాథల ఆపద్బాంధవుడు ఆయన. వితంతువుల పాలిట తరుణోపాయం ఆయన. అతిథుల్ని గొప్పగా సన్మానించే వ్యక్తి ఆయన. మురికివాడల్లోకి వెళతారు ఆయన. అక్కడ చిరిగిన చొక్కాలతో, చాలీచాలని ఉడుపులతో చీమిడి కారుస్తున్న చిన్న పిల్లల తలల్ని ఆప్యాయతతో నిమురుతారు. వారి చీమిడిని తన స్వహస్తాలతో తుడుస్తారు... అగత్యపరులు ఆయన్ను చూసి మహా సంబరపడేవారు. అందుకే 'ప్రభంజనం కన్నా వేగంగా దానధర్మాలు చేసేవారని' ఆ ఊరి ప్రజలే ఆయనకు కితాబిచ్చారయ్యా.

గోరింక: 'దానికి బదులు నాకు ఎర్ర ఒంటెలు కూడా నచ్చవు' అని ఆయన (ﷺ) దేని గురించి అన్నారే ప్రాణ సఖీ! దేని గురించి అన్నారు?

చిలుక: హిల్ఫుల్ ఫుజూల్ ఒప్పందం గురించి చెప్పిన మాట అది! ఆ ఒప్పందంలోని షరతులు కొన్ని - 1) మనలోని ఏ ఒక్కడూ ఇతరుల హక్కును కొల్లగొట్టకూడదు. 2) మనం బలవంతుడి నుండి బలహీనుడి హక్కు, స్థానికుడి నుండి బాటసారి హక్కును ఇప్పిస్తాము. 3) దౌర్జన్యపరుడికి వ్యతిరేకంగా చుట్టప్రక్కల ప్రాంతాల్లో ఎక్కడైనాసరే పీడిత జనాలకి సహాయపడటం జరుగుతుంది. ఇదేనయ్యా ఆ ఒప్పందం.

గోరింక: తాయిఫ్ దారిలో తోటకొచ్చిన జిన్నుల సంగతేంటే ప్రియసఖీ! జిన్నుల సంగతేంటి?

చిలుక: అది 'నఖ్లా' అనే ప్రదేశం అర్ధ రాత్రి వేళ. ప్రశాంత వాతావరణం. నిశ్శబ్ద పరిసరాలు. దైవప్రవక్త (ﷺ) నిలబడి

నమాజు చేస్తున్నారు, సుమనోహర, సమధుర స్వరంతో ఖుర్‌ఆన్ వచనాల్ని పఠిస్తున్నారు. అండ, పిండ, బ్రహ్మాండాలు నిశ్శబ్దంగా వింటూ ఖుర్‌ఆన్ మృదు మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదిస్తున్నాయి. అట్టి ప్రశాంత సమయంలో జిన్నుల సమూహం ఒకటి అటుగా వెళుతూ ఠక్కున ఆగింది. ఖుర్‌ఆన్ పారాయణం వారి చెవిన పడింది. ఆ మధుర వాణి వారి చెవులకింపుగా, వింతగా తోచింది. ఆగి వారు ఆ దివ్య వాణిని శ్రద్ధగా, శ్రవణానందంతో ఆలకించసాగారు. వినేకొద్దీ వారు దానికి వశమైపోయారు. పరవశమైపోయారు. అది వారి మనో ఫలకాలపై ముద్రించుకు పోయింది. సత్యకాంతులతో వారి హృదయ చీకట్లు, మానసిక రుగ్మతలు మటుమాయమైపోయాయి. ప్రార్థనానంతరం వారందరూ ఇస్లాం స్వీకరించారు. ఆనక తమ జాతి జనాల వద్దకు వెళ్ళి వారిని కూడా సత్య ధర్మం వైపు ఆహ్వానించారు. ఈ సంఘటనను పేర్కొంటూ ఒక అధ్యాయం 'జిన్' పేరుతో ఖుర్‌ఆన్‌లో కూడా ఉంది.

గోరింక: 'చంద్ర ఖండనం' ఎలా జరిగిందే సఖియా! ఎలా జరిగింది?

చిలుక: అదొక చారిత్రక సంఘటన. నేటికి సుమారు అయిదు సంవత్సరాల క్రితం పున్నమి రాత్రి చంద్రోదయం జరిగిన కొద్దిసేపటికే ఈ సంఘటన జరిగింది. అవిశ్వాసుల డిమాండ్ మీద దేవుడు మహా ప్రవక్త ﷺ వారికి ఇచ్చిన అద్భుత మహిమ అది. ఆ సమయంలో దైవప్రవక్త ﷺ మక్కా సమీపంలోని 'మినా' ప్రాంతంలో ఉన్నారు. దైవాదేశం మేరకు ఆయన తన వ్రేలుని చంద్రుడి వైపు చూపించారు. తక్షణమే పూర్ణ చంద్రుడు రెండు ఖండాలుగా చీలిపోయి తృటిలోనే మళ్ళీ కలుసుకోవడం జరిగింది. అక్కడున్నవారిని చూపిస్తూ "మీరు దీనికి సాక్షులుగా ఉండండి" అన్నారు అంతిమ ప్రవక్త ﷺ. అంత పెద్ద మహత్యాన్ని తమ చర్మ చక్షువులతో వీక్షించినా మక్కా అవిశ్వాసుల హృదయ చక్షువులు మాత్రం తెరుచుకోలేదు. 'ఇదో కనికట్టు' అని ఇట్టే కొట్టిపారేశారు. ఇతర ప్రాంత జనాలు వచ్చి సాక్ష్యమిచ్చినా, వారి హృదయ కవాటాలు మాత్రం యథాలాపంగా మూతబడే ఉన్నాయి. ఖుర్‌ఆన్‌లో 'ఖమర్' అధ్యాయంలో దీని ప్రస్తావన ఉంది.

గోరింక: ఖుర్‌ఆన్ గ్రంథం గురించి తెలుపవే ప్రాణేశ్వరీ! తెలుపు.

చిలుక: సుహుఫ్ ఇబ్రాహీమ్, సుహుఫ్ మూసా, తౌరాత్, జబూర్ ఇన్జీల్ వంటి పవిత్ర దైవగ్రంథాలు మహా నదులైతే ఆ నదుల న్నింటికి మూలం మహా సాగరమైన ఖుర్‌ఆన్. దివ్య ఖుర్‌ఆన్ సాక్షాత్తు అల్లాహ్ వాక్కు. దైవ దూతల నాయకుడు జిబ్రయీల్ ﷺ వారి మాధ్యమంతో దైవప్రవక్త ముహమ్మద్ ﷺ వారి హృదయ ఫలకంపై అవతరింపజేయబడిన అపురూప వాణి ఖుర్‌ఆన్. విశ్వ ఖనిలో నాటికీ, నేటికీ, మరేనాటికీ లభించని అమూల్యమైన విజ్ఞానమణి ఖుర్‌ఆన్. 114 అధ్యాయాలతో శోభించుచు, విశ్వమంతటికి విజ్ఞానాన్ని పంచుతూ, ఇహపరాల మార్గదర్శకత్వాన్ని వహిస్తూ, దైవ కృపాకటాక్షాల వర్షాన్ని ఎడతెరపి లేకుండా కురిపిస్తూ, సర్వరోగ నివారిణిగా నీరాజనాలందు కుంటున్న నిరుపమాన గ్రంథం ఖుర్‌ఆన్. మనిషిని మహా మనీషిగా, మానవుని మహనీయునిగా మార్చగల అద్భుత శక్తి గల గ్రంథరాజం ఖుర్‌ఆన్. అది అపారమైన దేదీప్యమానమైన వెలుగులను కలిగి, విజ్ఞానములనెడి కిరణములను ప్రసరింపజేసే ఒక దివ్య జ్యోతి ఖుర్‌ఆన్. ఈ కారణంగానే ధర్మానికి, దైవ ప్రవక్తకి బద్ధ శత్రువైన అబూ జహల్ వంటి నాయకులు దాగి వింటూ, దీని మృదు మధుర పారాయణానికి పరవశించిపోతూ తాదాత్మ్యం చెందేవారు. ఈ గ్రంథ పారాయణం వారిపై ఎంతటి ప్రభావాన్ని చూపిందంటే ఒకానొక సందర్భంలో "ఫస్జుదూ లిల్లాహి వఅబుదూ" అన్న వచనంపై ప్రవక్త ﷺ వారు సజ్దా చేయగా వినే అవిశ్వాసులందరూ అమాంతంగా సజ్దాలో పడిపోయారు.

ఖుర్‌ఆన్ పఠనం, పాఠనం, విచారణం, శ్రవణం చేసే వ్యక్తి కోరికల్ని అతను కోరకనే అల్లాహ్ తీరుస్తాడు. దీని పారాయణం మనో రుగ్మతలను దూరం చేయడమే కాక, పాప ప్రక్షాళనం చేస్తుంది. దీని ద్వారా జ్ఞాన సిద్ధి పొందిన సౌభాగ్యవంతుడు స్వర్గానికి అన్ని విధాలా అర్హుడవుతాడు.

అంతేగాక దివ్య ఖుర్‌ఆన్ ఏ ఒక్క వర్గానికో, వర్ణానికో, దేశానికో, కాలానికో పరిమితమైన గ్రంథం కాదు. అన్ని ప్రాంతాలవారు, భూపాలుర నుండి గోపాలుర వరకూ పండితుల నుండి పామరుల వరకూ, అగ్ర వర్ణాలు, అధమ వర్ణాలు అన్న తేడా లేకుండా, స్త్రీ పురుషులన్న వ్యత్యాసం లేకుండా, పెద్దలు, పిల్లలు అన్న కృత్రిమ గీతలు లేకుండా అందరూ ఈ మహామృత పానం చేయవచ్చు. ఇంతటి విశాలార్థం, అగాధ భావం, సత్యం సమత్వం, సౌమనస్యం, సాత్వికం ఉన్న గ్రంథం సమస్తలోకాల్లో ఇంకొటి లేదన్నది ఆ విశ్వ సామ్రాట్టు చెప్పిన మాట. మానవ జాతి మొత్తం కలిసి ప్రయత్నించినా, సహాయంగా జిన్నులను తోడు తీసుకున్నా, ఒక్క అల్లాహ్‌ను మినహా మరెవ్వరి సహాయాన్ని పొందినా ఇందులోని ఒకే ఒక్క అధ్యాయాన్ని లిఖించుకురాలేరు అన్నదీ ఆయన అన్న మాటే. అది అక్షరాలా నిజం కూడాను.

గోరింక: ఆయన ﷺ చేతుల మీద జరిగిన 'క్షీర సాగర' సంఘటన గురించి చెప్పవే చిలకా! చెప్పు.

చిలుక: ఇది రెండు రోజుల క్రితమే జరిగిన సంఘటన. ప్రవక్త ﷺ ఆయన సహచరులు తీవ్ర ఆకలిదప్పులతో ఉన్నారు. దారిలో ఒక శిబిరం ముందు కూర్చొని ఉన్న ఓ మహిళామూర్తిని 'మీ దగ్గర తినడానికి ఏమైనా ఉందా?' అనడిగారు ప్రియ ప్రవక్త ﷺ. 'ఉన్న మేకలన్నింటిని మా ఆయన మేపుకు రావడానికి వెళ్ళారు. ఇంట్లో తినుబండారాలు ఏమీ లేవు. ఈ బక్కచిక్కిన మేక మాత్రం ఇక్కడుండిపోయింది' అని సమాధానమిచ్చిందావిడ.

'మీరు అనుమతిస్తే నేను దాని పొదుగు నుండి పాలు తీస్తాను' అన్నారు ప్రవక్త ﷺ. 'దాని పొదుగులో అసలు పాలుంటే కదా మీరు తీయటానికి. అయినా 'నేను తీస్తాను' అంటే నాకెలాంటి అభ్యంతరం లేదు' అన్నదామె. అప్పుడు దైవప్రవక్త ﷺ ఆ మేక దగ్గరకు పోయి, ఓ పెద్ద పాత్ర తెప్పించి, అల్లాహ్ పేరును స్మరించి పాలు పితకటం ప్రారంభించారు. పాలు ధారాపాతంగా వస్తున్నాయి. అక్కడున్నవారందరూ కడుపునిండా పాలు త్రాగారు.

అబ్దుల్ మతీన్ ఉమ్రీ

ముస్లిం ధార్మిక విశ్వాసం

ప్రశ్న: అల్లాహ్ మనల్ని ఎందుకు పుట్టించాడు?

జవాబు: ఆయన మనల్ని కేవలం తన ఆరాధన కొరకు సృష్టించాడు.

ఖుర్‌ఆన్: నేను జిన్నాతులను, మానవులనూ కేవలం నా ఆరాధన కొరకు మాత్రమే సృష్టించాను. (అజ్ జారియాత్: 56)

హదీస్: అల్లాహ్‌కు ఆయన దాసులపై ఉన్న హక్కు ఏమిటంటే, వారు ఆయన్నే ఆరాధించాలి. ఆరాధనలో మరెవ్వరినీ భాగ స్వాములుగా చెయ్యకూడదు. (బుఖారీ, ముస్లిం)

ప్రశ్న: అల్లాహ్ దాస్యం మనం ఏ విధంగా చెయాలి?

జవాబు: అల్లాహ్, ఆయన ప్రవక్త ముహమ్మద్ (ﷺ) ఆదేశించిన విధంగా చిత్తశుద్ధితో చెయ్యాలి.

ఖుర్‌ఆన్: వారు విధేయతను ఆయనకే ప్రత్యేకిస్తూ, అల్లాహ్ దాస్యం చెయ్యాలని, మిథ్యా దైవాల నుంచి ముఖం త్రిప్పుకోవాలని మాత్రమే ఆదేశించడం జరిగింది. (అల్ బయ్యినహ్: 5)

హదీసు: మనము ఆచరించినట్లుగా నిర్ధారితం కాని ఆచరణ ఏదైనా రద్దు చేయబడుతుంది (స్వీకరించబడదు). (ముస్లిం)

ప్రశ్న: మనము అల్లాహ్ దాస్యం భయంతో, ఆశతో చేయాలా?

జవాబు: అవును, ఆయన దాస్యం శిక్ష పడుతుందనే భయంతో, పుణ్యఫలం లభిస్తుందనే ఆశతో చేయాలి.

ఖుర్‌ఆన్: మీరు ఆయన్నే వేడుకోండి, భయంతోనూ, ఆశతోనూ (అంటే నరకానికి భయపడుతూ, స్వర్గం లభిస్తుందనే ఆశతో).

(అల్ ఆరాఫ్: 56)

హదీస్: నేను స్వర్గం ప్రసాదించమని అల్లాహ్‌ను వేడుకుంటున్నాను. నరకం నుంచి ఆయన శరణు కోరుకుంటున్నాను.

(అబూ దావూద్)

ప్రశ్న: ఆరాధనలో ఇహ్సాన్ అంటే ఏమిటి?

జవాబు: అల్లాహ్ మనల్ని కనిపెట్టుకుని ఉన్నాడనే భావన కల్గి ఉండడాన్ని 'ఇహ్సాన్' అంటారు.

ఖుర్‌ఆన్: నిస్సందేహంగా అల్లాహ్ మిమ్మల్ని కనిపెట్టుకుని ఉన్నాడు. (అన్నిసా: 1)

మీరు నమాజ్ చేసేటప్పుడు ఆయన మిమ్మల్ని చూస్తున్నాడు.

(అష్ షుఅరా: 218)

హదీస్: ఇహ్సాన్ అంటే, నీవు అల్లాహ్ ఆరాధనను, ఆయన్ని చూస్తున్నట్లుగా చేయటం. నీవు ఆయన్ని చూడకపోయినా, ఆయనయితే నిన్ను చూస్తున్నాడన్న భావంతో ఆయన్ను ప్రార్థించటం. (ముస్లిం)

అజీజుర్రహ్మాన్



సమయ పాలనకు సాటిలేని కొలమానం

మనిషి తన జీవితంలో సాధించే విజయాల వెనుక దాగివున్న అతి పెద్ద రహస్యం అతని దైనందిన కార్యక్రమాలు వేళకు నెరవేరటం! మనిషి సహజంగా సుఖసౌఖ్యాలను కోరుకునేవాడై ఉంటాడు. మనిషిని సమయ పాలకుడిగా మలచటానికి కొన్ని పని వేళలను బలవంతంగా నిర్ధారించవలసి ఉంటుంది. ఉదాహరణకు:- పోలీసు బెటాలియన్ వారు గానివ్వండి, మిలటరీ డిపార్ట్‌మెంటు వారు గానివ్వండి ఉదయాన్నే తమ జవానులను క్యాంపులకు పిలిచి కవాతు చేయిస్తారు. ఇష్టమున్నా లేకున్నా జవాను మాత్రం వేళకు రావలసిందే. ఆలస్యమైతే దండన తప్పదు.

అలాగే మనిషి వాణిజ్య రంగంలో, వ్యవసాయ రంగంలో పని వేళలను నిర్ధారిస్తారు. ఆఫీసు పని వేళలు కూడా ఖచ్చితంగా నిర్ధారించబడి ఉంటాయి.

ఈ విధంగా దినచర్యల వేళలను నిర్ధారించుకుని, సమయ పాలన చేసే వ్యక్తి నియమబద్ధంగా ఉంటాడు. సమయాన్ని వృధా చేయడు.

నమాజు వేళలు కూడా అంతే. రోజూ ఐదు పూటలు వేళకు నమాజు చేసే వ్యక్తి, తన ఇతరత్రా పనులు కూడా వేళకు చేసుకుంటాడు. సమయానికి తినటం, సమయానికి నిద్రించటం, సమయానికి లేవటం, సమయానికి పనికి వెళ్ళటం - ఈ విధంగా అతని జీవితంలో క్రమశిక్షణ తొణికిసలాడుతూ ఉంటుంది. అతను కాలం విలువను తెలుసుకుంటాడు. ఎందుకంటే కాలం ఒక అమానతు (అప్పగింత), కాలమే జీవితం. దాన్ని నాశనం చేసినవాడు ఖుద్దుగా నాశనమవు తాడు. ప్రఖ్యాత ఆంగ్ల కవి షేక్స్‌పియర్ ఇలా అనేవాడు: **"నేను కాలాన్ని నాశనం చేశాను. ఇప్పుడు కాలం నన్ను నాశనం చేస్తోంది".**

సుప్రసిద్ధ ప్రవక్త ప్రియ సహచరులు సల్మాన్ ఫారసీ (రజి) ఇలా వక్కాణించారు:

"నమాజు ఒక కొలమానం. ఈ కొలపాత్రతో పూర్తిగా కొలిచి ఇచ్చిన వారికి, పూర్తిగా కొలిచి ఇవ్వటం జరుగుతుంది. ఎవడు కొలిచి ఇవ్వటంలో తగ్గించాడో తగ్గించి ఇచ్చేవారి పరిణామం మీకు తెలిసిందే".

ఈ పలుకుల్లో దాగివున్న మరో మర్మం ఏమిటంటే నమాజ్ ముస్లిం యొక్క ప్రతి వ్యవహారానికి కొలమానం వంటిది. దీని ఆధారంగానే అతని వ్యవహారాలన్నీ కొలవబడతాయి.-



అబుల్ హసన్

ఖుర్ఆన్ బోధకులంటే...

నువ్వో
సైంటిస్టువి కావాలన్నా
సంస్కర్తవి అవ్వాలన్నా
ముందు
ఖుర్ఆన్ అధ్యయనం బాగా చేయాలి
లోతుల్లోకెళ్ళి
నర్మగర్భిత రహస్యాలను ఛేదించాలి

నువ్వు
అనాగరికత మరామత్ చేయాలన్నా
అవినీతి హజామత్ చేయాలన్నా
ముందుగా
ఖుర్ఆన్ చదవాలి

నువ్వు
స్వర్గలోకం చేరాలన్నా
ఫిర్‌దౌస్ శిఖరం తాకాలన్నా
ముందుగా
ఖుర్ఆన్ చదవాలి

నువ్వు
అవినీతిని చీల్చి చెండాడే
శరంగా ఇక మారాలన్నా
హింసావాదుల అన్యాయాలను
అహింసతో జయించాలన్నా
ముందుగా నువ్వు
ఖుర్ఆన్ చదవాలి

నువ్వు
మానవత్వ పరిమళాలు పంచాలన్నా
దానవత్వ దుర్గంధాలు తొలగించాలన్నా
మనిషి మనీషిగా ఎదగాలన్నా
దైవ సేనలో కలవాలి
ఖుర్ఆన్ చేబూని కదలాలి

నువ్వు
దైవప్రవక్త (స) సహచర్యం పొందాలన్నా
దైవ దర్శనంతో పునీతమవ్వాలన్నా
ముందుగా
ఖుర్ఆన్ చదవాలి
నువ్వు
ఖుర్ఆన్ అధ్యయనం బాగా చేయాలి
దాని
అవతరణ లక్ష్యాలను సాధించాలి

అమ్మ అక్కడే ఉంది...

- ముహమ్మద్ మునైఫ్ బొర్రా



అమ్మ అక్కడే ఉంది...
నీ జీవితం ప్రారంభమైనప్పుడు, నీకీ ప్రపంచం కొత్తైనప్పుడు
నీకు ఆకలైనప్పుడు, పక్క తడిసినప్పుడు, నిద్ర వచ్చినప్పుడు

అమ్మ అక్కడే ఉంది...
నీవు నడక నేర్చినప్పుడు, నీకు నడత నేర్పినప్పుడు
నిన్ను పక్కమీద నుండి లేపినప్పుడు, నిన్ను బడికి
పంపినప్పుడు

అమ్మ అక్కడే ఉంది...
నీ చదువు సంధ్యల్లో సాయపడ్డప్పుడు, నీ మంచీ చెడుల్లో
మార్గదర్శనప్పుడు
నీతో ప్రార్థనలు పలికించినప్పుడు, నిద్రలో పీడ కలల
నుండి నిన్ను ఓదార్చినప్పుడు

అమ్మ అక్కడే ఉంది...
నీ అభిప్రాయాలను విన్నప్పుడు, నీకు సలహాలనిచ్చినప్పుడు
నీ మనసు గాయపడినప్పుడు, దెబ్బతిన్నప్పుడు, నీకు
స్థయిర్యాన్నిచ్చినప్పుడు

అమ్మ అక్కడే ఉంది...
నీ ఉన్నతినీ, భోగభాగ్యాలను కళ్ళారా చూచి
ఊర్ధ్వలోకాలకేగినా, ఆ ప్రేమ అమరంగా అక్కడే ఉంది
నీ హృదయంలో ఉంది....
అమ్మ అక్కడే ఉంది...

షేక్ అబ్దుల్ అజీజ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ బాజ్

చేతి సైగతో 'సలాం' చేయవచ్చునా?

ప్రశ్న: చేతి సైగ ద్వారా 'సలాం' చేయటం గురించి ఏమని ఆజ్ఞాపించబడింది? – ఒక పాఠకుడు.

జవాబు: సైగ (సంజ్ఞ)తో 'సలాం' చెప్పటం సమ్మతం కాదు. మనిషి ఎక్కడ ప్రవేశించినా నోటితో – వినబడేలా – సలాం పలకడమే సంప్రదాయం (సున్నత్). చేతి సైగ ద్వారా సలాం చేయటం, విష్ చేయటం ముస్లిమేతర పద్ధతి.

అయితే ఎదుటి వ్యక్తి మన సలాం పలుకును వినలేనంత దూరాన ఉన్నప్పుడు నోటితో పలకటంతోపాటు చేత్తో కూడా సైగ చేయటంలో తప్పు లేదు. ఎందుకంటే ఈ విధానాన్ని సమర్థించే హదీసు కూడా ఉంది. అలాగే మనం సలాం చెప్పిన వ్యక్తి గనక నమాజు చేస్తూ ఉంటే, అతను 'సైగ' ద్వారా ప్రతిసలాం చెయ్యగలడు. దైవప్రవక్త ﷺ విధానం ద్వారా ఈ విషయం రూఢీ అవుతోంది.

కన్న బిడ్డల్ని శపించటం

ప్రశ్న: ఆవిడ నిత్యం తన పిల్లలకు శాపనార్థాలు పెడుతూ ఉంటుంది. ఒక్కోసారి దూషణలతో పిల్లల మనసు నొప్పిస్తూ, ఒక్కోసారి కొడుతూ కూడా ఉంటుంది. ఆఖరికి పెద్ద పిల్లల్ని కూడా కొడుతూ ఉంటుంది. నేనామెకు ఎన్నోసారు నచ్చ జెప్పాను. అయినా ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు. పైపెచ్చు ఇలా అంటుంది: "అసలు నువ్వే వాళ్ళను చెడ గొడుతున్నావ్. నీ మూలంగానే వాళ్ళు ఇలా తయార య్యారు". ఆమె కరకు వైఖరి మూలంగా పిల్లలు ఆమెను ద్వేషించుకుంటున్నారు. ఆమె మాటను బొత్తిగా లక్ష్య పెట్టడం లేదు.

ఆమె దురుసు ప్రవర్తనతో నేను విసిగి వేసారిపోయాను. షరీయతు పరంగా ఆమెలో పరివర్తన కోసం నేనేం చేయాలి? ఆమెకు విడాకులివ్వమంటారా? దయచేసి నాకు సరైన సలహా ఇవ్వగలరు? – ఒక సోదరుడు – ఈజిప్టు)

జవాబు: కన్న బిడ్డల్ని శపించటం పెద్ద పాపం. ఆ మాటకొస్తే అకారణంగా ఎవరినీ శపించకూడదు. ప్రామాణిక హదీసు ప్రకారం మహనీయ ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: "విశ్వాసిని శపించటం అతన్ని వధించటం వంటిదే".

ఆయన ﷺ ఇంకా ఇలా వక్కాణించారు: "ముస్లింను దూషించ టం పాపం. అతన్ని చంపటం అవిశ్వాసాని(కుఫ్ర్)కి చిహ్నం".

ఆయన ﷺ ఈ విధంగా కూడా చెప్పారు: "శాపనార్థాలు పెట్టేవారు ప్రళయదినాన సాక్షులుగా ఉండటం గానీ, సిఫారసు చేసేవారు గానీ కాలేరు".

కాబట్టి మీ శ్రీమతిగారు తన వైఖరిని సరిదిద్దుకోవాలి. అన్నిటికన్నా ముందు ఆమె అల్లాహ్ సన్నిధిలో క్షమాపణ వేడుకోవాలి. తన పిల్లలకు శాపనార్థాలు పెట్టడం మానుకోవాలి. దాంతోపాటు ఆమె తన పిల్లల బాగోగుల కోసం దుఆ చేస్తూ ఉండాలి. అలాగే మీరు మీ శ్రీమతిగారికి మృదువుగా నచ్చ చెబుతూ ఉండండి. అప్పటికీ ఆమె వైఖరిలో మార్పు రాకపోతే దిద్దుబాటు నిమిత్తం కొంత కాలం ఆమెకు దూరంగా ఉండండి. తొందరపడి విడాకుల వరకూ పోవద్దు. మేము మీ కోసం, మీ పిల్లల కోసం, మీ శ్రీమతిగారిలో పరివర్తన కోసం దుఆ చేస్తూ ఉంటాము.



పర స్త్రీతో కరచాలనం చేయటం

ప్రశ్న: ఒక పురుషుడు పర స్త్రీతో కరచాలనం చేయవచ్చా?

– అబ్దుల్ లతీఫ్ (రియాద్)

జవాబు: మహ్రమ్ కాని పురుషులతో స్త్రీలు కరచాలనం చేయటం ఎట్టి పరిస్థితిలోనూ సమ్మతం కాదు. ఆ స్త్రీలు వృద్ధులైనా, యువతులైనా లేక కరచాలనం చేసే పురుషులు వృద్ధులైనా యువకులైనా సరే – కరచాలనం ధర్మ సమ్మతం కాదు. ఎందుకంటే ఈ కరచాలనాలే ముమ్ముందు ఉభయులకూ సమస్యగా పరిణమిస్తాయి. వారిని కఠిన పరీక్షలకు గురి చేస్తాయి. అందుకే మహా ప్రవక్త ﷺ ఇలా వక్కాణించారు:

"నేను (పర) స్త్రీలతో కరచాలనం చేయను".

మన అమ్మ ఆయిషా (ర) ఏమన్నారో గమనించండి –

"ఏ (పర) స్త్రీ చేయి కూడా ప్రవక్త ﷺ వారి చేతిని ఎన్నటికీ తాకలేదు. ప్రమాణ స్వీకారం (బైఅత్) చేయించాల్సివస్తే దైవప్రవక్త ﷺ వారి చేత మూజువాణీగా చేయించేవారు, అంతే".

- అబుల్ తాసన్

నేటి బాలలే రేపటి పౌరులు - 6



అల్లాహ్ హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) గారిని వారి వైపునకు పంపాడు. నిశ్చయంగా ప్రతీది అల్లాహ్ అధీనంలోనే ఉందనీ, ధరిత్రిపై నివసించే ప్రతి జీవికి ఉపాధి ప్రదాత ఆయనేననీ, సృష్టిరాసుల జీవన్మరణాలు ఆ సర్వేశ్వరుడి చేతిలోనే ఉన్నాయనీ, ఆయన ఆజ్ఞ లేనిదే పూచిక పుల్లయినా కదలదనీ, మనిషి ఆరోగ్యానారో గ్యాలు కూడా ఆయన అధీనంలోనే ఉన్నాయనీ, ఎవరికి ఏ సంతానం ప్రసాదించాలో కూడా ఆయనే నిర్ణయిస్తాడనీ, ఆయనే నన్ను, నిన్ను - మనందరినీ పుట్టించాడనీ, ఆయన్ను తప్ప మరొకరిని ఆరాధించవద్దనీ, ఆయన చెప్పినట్లు నడుచుకోవడంలోనే ఇహపరాల సాఫల్యం దాగుందని హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) తన జాతివారికి బోధించారు.

కాని ఆయన జాతివారు వ్యతిరేకించారు. మేము ఒకే దైవానికి పరిమితం కాలేమని తేల్చి చెప్పేశారు. వాళ్లు ఇలా అన్నారు: "ఈ విగ్రహారాధనను ఎలా వదులుకోవాలి? ఇది మా తాతముత్తాతల కాలం నుండి వంశపారంపర్యంగా వస్తున్న సంప్రదాయమయ్యే"-ఈ విధంగా వారిలో కొందరు తప్ప మిగతా వారంతా ప్రవక్త నూహ్ (అలైహిస్సలాం) మాటలను త్రోసిపుచ్చారు.

హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) ఎంతో బాధ పడ్డారు. అయినా 950 సంవత్సరాల వరకు వారిని అల్లాహ్ వైపు పిలుస్తూనే ఉన్నారు. మరెప్పటికీ వీరి ప్రవర్తనలో పరివర్తన రాబోదని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాక తన జాతి వ్యతిరేకత గురించి అల్లాహ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారిని నాశనం చెయ్యమని మొర పెట్టుకున్నారు. అల్లాహ్ ఆయన మొరను ఆలకించాడు. అతి త్వరలో ప్రళయం లాంటి ఓ తుఫాను రాబోతుందనీ, ప్రపంచంలో ఉన్న అవిశ్వాసులంతా ఈ తుఫానులో కొట్టుకు పోతారని సూచించాడు అల్లాహ్.

ఓ పెద్ద పడవ తయారు చేసుకోమనీ, ఆ పడవలో ఎక్కిన విశ్వాసులందరినీ కాపాడుతానని అల్లాహ్ హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) గారికి తెలియపర్చాడు.

కథను మధ్యలో ఆపి, 'సరే కథల పుస్తకాలు చదువదలచుకున్నవాళ్ళంతా చేతులెత్తండి' అన్నాడు అలీ. అందరూ చేతులెత్తారు.

'అయితే ఇదివరకు మీరు ఏయే కథల పుస్తకాలు చదివారో వాటి పేర్లు చెప్పండి' అన్నాడు. కొద్ది మంది రెండు మూడు కథలు చదివామని చెబితే, మరి ఇద్దరు ముగ్గురు మేము 'ప్రియ ప్రవక్త (ﷺ) పుస్తకం చదివాం' అన్నారు.

"మీలో ఎవరి ఇంటికైనా వార పత్రిక, లేదా మాస పత్రిక వస్తుందా? అని అడిగాడు. ఇద్దరు మాత్రం మా ఇంటికి వార పత్రిక గీటురాయి, మాస పత్రిక జిక్రా వస్తుందన్నారు.

అయితే, నేను కథల పుస్తకాలు తెస్తాను. మీరందరూ చదవండి. కావలసినన్ని కథల పుస్తకాలు తెస్తాను. మీరు చదివి చదివి అలసిపోతారనుకోండి' అన్నాడు అలీ. అందరూ చాలా సంతోషంగా కన్పించారు. కథ మళ్ళీ మొదలయ్యింది.

అల్లాహ్ ఆదేశం మేరకు హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) గారు పని ప్రారంభించారు. మండుటెండల్లో, నీలాకాశం క్రింద, సలసలకాగే ఎడారిలో ఆయన మరియు విశ్వాసులు పడవ తయారు చేయడంలో నిమగ్నులైపోయారు. దారి గుండా సాగిపోయే ముగ్గురు అవిశ్వాస జనులు వారిని చూసి ఇలా గుసగుసలాడుకుంటున్నారు. "మూర్ఖుడు...మూర్ఖుడు! ఎడారిలో పడవ తయారు చేస్తున్నాడు... దీన్ని నడిపించడానికి నీళ్ళు ఎక్కడి నుంచి తెస్తాడో? సమీపంలో సముద్రం కూడా లేకపాయే... ఇది ఎక్కడ నడుస్తుందబ్బా!?" ఇంకో వ్యక్తి ఇలా అన్నాడు: "భలే - భలే నిన్నటి దాకా తను ప్రవక్తనన్నాడు సరే. మాకు తెలియకుండా ఇప్పుడు కార్పెంటర్ ఎలా అయ్యాడబ్బా? ఆశ్చర్యంగా ఉందే...!" మూడో వ్యక్తి ఫకాలున నవ్వాడు. వారం దరూ విరగబడి నవ్వారు. హా--హా--హా-- ఇతను ప్రవక్తంటా! అంటూ పరిహాసమాడారు. మదిని గాయ పరిచే మాటల తూటాలు పేల్చారు. అయినా ప్రవక్త నూహ్ (అలైహిస్సలాం) సహించారు. ఓర్పుతో, నేర్పుతో పడవ తయారీని పూర్తి చేశారు. ఆ పడవ చాల ఎత్తైనది. ఓ పెద్ద కొండంతటిది అనుకొండి...

సమయం దగ్గర పడింది... ప్రజలం దరూ తమ కార్యాల్లో మునిగి ఉన్నారు. అటు దూరాన చెట్టు క్రిందున్న బండ మీద కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం-చేసే ముగ్గురు వ్యక్తుల్లోని ఒకడు అకస్మాత్తుగా వాతావరణంలో వచ్చిన వింత మార్పుని గమనిస్తూ ఇలా అన్నాడు: "ఏమిటి విశేషం! ఈ రోజు వాతావరణం గందరగోళంగా ఉందే... చూడండి ఉరుములు... ఉరుములు...!" మరో వ్యక్తి - మెరుపులు...మెరుపులు.. !! మూడో వ్యక్తి - ఉరుములు... మెరుపులు..!!! అయ్యో పరుగెత్తండి... ఆకాశం కుండలతో మాపై వర్షాన్ని కుమ్మరిస్తోంది...! అమ్మమ్మో! భూమి క్రింది నుంచి కూడా నీళ్ళు ఆగకుండా ఉబికి, ఉబికి వస్తున్నాయే...!! పారిపోండి! ప్రాణాలు కాపాడుకోండి. బావులు, కుంటలు, చెరువులు, నదులు ఉప్పొంగాయి... ఇక మనం బ్రతకడం కష్టం..!!!" చూస్తూ చూస్తుండగానే భూమండలమంతా జల ప్రళయంతో అతలాకుతలమైపోయింది...

IPC ఆధ్వర్యంలో ఈదుల్ ఫిత్ర్

ఐపిసి తెలుగు విభాగం ఆధ్వర్యంలో 10-09-2010 వ తేదీ శుక్రవారం ఈదుల్ ఫిత్ర్ సంబరాలు వైభవోపేతంగా జరిగాయి. తెలుగు ముస్లిం అసోసియేషన్ (టి ఎం ఎ) అనుబంధంతో జరిగిన ఈ ఉత్సవంలో న్యూ ముస్లిం సోదరసోదరీమణులతో సహా మొత్తం 550 ముస్లిం స్త్రీ పురుషులు, బాలలు పాల్గొని, కువైట్‌లోని మస్జిద్ అల్ హమద్‌లో ఈద్ నమాజ్ చేశారు. ఈ కార్యక్రమానికి అన్ని బ్రాంచీలకు చెందిన ఐపిసి తెలుగు దాయీలు, దాయియాత్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా క్రీడోత్సవాలు, క్విజ్ ప్రోగ్రామ్ నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వబడ్డాయి.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో తోడ్పడిన కార్యకర్తలందరికి, ముఖ్యంగా టిఎమ్ఎ టీమ్‌కు ఐపిసి తెలుగు విభాగం మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటోంది.

















- అబుల్ తాసన్

ఫీమా (FIMA) వారి ఇఫ్తార్

ఫీమా ఆధ్వర్యంలో 22-08-2010వ తేదీ ఆదివారం నాడు స్థానిక క్రౌన్ ప్లాజా హోటల్‌లో ఇఫ్తార్ ఏర్పాటు చేయబడింది. కువైట్‌లోని భారత ఎంబాసిడర్ శ్రీ అజయ్ మల్హోత్రాతో సహా పలు దేశాల దౌత్యవేత్తలు, ఉలమాలు, ముస్లిం ప్రముఖులు, మేధావులు ఈ విందుకు హాజరయ్యారు.





తెలుగు ముస్లిం అసోసియేషన్ (TMA) వారి ఇఫ్తార్





టి ఎం ఎ ఆధ్వర్యంలో 20-08-2010వ తేదీ శుక్రవారం నాడు స్థానిక మస్జిద్ అల్ హమద్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయబడింది. అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ ముహమ్మద్ హనీఫ్, వ్యవస్థాపకులు శ్రీ షేఖ్ ఇస్హాఖ్ అలీ ఆహూతులకు స్వాగతం పలికారు. ఉలమా కౌన్సిల్ సెక్రటరీ మౌలానా తాహెర్ మదనీతో సహా పలువురు పండితులు ఈ సందర్భంగా ప్రసంగించారు. ఔఖాఫ్ ఆహ్వానంపై ముఖ్య అతిథిగా విచ్చేసిన జనాబ్ సయ్యిద్ అహ్మద్ బాషా (బాబు భాయి) తెలుగులో ప్రసంగించారు.

హసన్ సయ్యద్

అల్లాహ్ తన ప్రియతముడైన ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) గురించి ఇలా తెలియపర్చాడు: "ఇబ్రాహీమ్ ఇలా వేడుకున్నాడు - "ఓ అల్లాహ్! ఈ (మక్కా) నగరాన్ని శాంతి నగరంగా చెయ్యి. నన్ను, నా సంతానాన్ని విగ్రహారాధన బారి నుండి కాపాడు. ఈ విగ్రహాలు (వాటి పట్ల గల వల్లమాలిన అభిమానాలు) అనేక మందిని దారి తప్పించాయి. (నా సంతానాన్ని కూడా దారి తప్పించే ప్రమాదముంది). (దివ్యఖుర్‌ఆన్ - 14: 35,36)

షిర్క్ పుట్టు పూర్వోత్తరాలు -4

హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) అంటే ఎవరు? అల్లాహ్ ఆయన గురించి ఏమని కితాబిచ్చాడో కాస్త గమనించండి - "నిశ్చయంగా ఇబ్రాహీమ్ ఒక అనుసరణీయ నాయకుడు. అల్లాహ్ పట్ల పూర్తి విధేయతతో కూడిన అంకిత భావం గల భక్తుడు. అతను ఏనాడూ దైవేతర శక్తుల్ని ఆరాధించినవాడు కాదు". (దివ్యఖుర్‌ఆన్ - 16: 120)

"ఇబ్రాహీమ్ ప్రభువు కొన్ని విషయాల్లో ఇబ్రాహీమ్‌ని పరీక్షించగా అందులో అతను కృతార్థుడయ్యాడు. అప్పుడు (అల్లాహ్) అతనితో 'నేను నిన్ను యావత్త మానవ జాతికి నాయకుడిగా నియమించబోతున్నాను' అన్నాడు". (దివ్యఖుర్‌ఆన్-2: 124)

అల్లాహ్ హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)ను, తన కొడుకుని జిబహ్ చేయమని ఆదేశించినప్పుడు ఆయన దైవాదేశాన్ని సంతోషంగా శిరసావహించారు. విగ్రహాలను తునాతునకలు చేశారు. విగ్రహారాధకులపై మండిపడ్డారు. ఇన్ని విశిష్ఠతలు కలిగి ఉండి కూడా తన సంతానం విగ్రహారాధన, బహుదైవ భావన మహమ్మారికి గురవుతారేమోనని కలత చెందుతున్నారు. బెంగ పెట్టుకుంటున్నారు. ఆయన్ని మించిన ఏక దైవారాధకుడు (మువహ్హిద్) ఎవరైనా ఉన్నారా? మరి ఆ మహానుభావుడే అంతగా ఆందోళన చెందుతుంటే, మనలాంటి మామూలు విశ్వాసం గలవారు ఇంకెంత జాగ్రత్తగా ఉండాలి? ఆయన తన సంతానాన్ని ఏ విధంగా హితోపదేశం చేస్తున్నారో చూడండి - ఇబ్రాహీమ్ తన కొడుకులకు హితవు చేస్తూ "నా బిడ్డల్లారా! అల్లాహ్ మీ కోసం ఈ జీవన విధానాన్నే నిర్ణయించాడు. కనుక చనిపోయే వరకూ దైవ విధేయులు (ముస్లింలు)గానే జీవించండి" అన్నాడు. (దివ్య ఖుర్‌ఆన్ - 2: 132)

అలాగే హజ్రత్ యాకూబ్ (అ) కూడా తన సంతానానికి ఏకేశ్వరోపాసన (తౌహీద్) గురించి నొక్కి వక్కాణించారు. "యాకూబ్ ఇహలోకాన్ని వీడి పోతున్నప్పుడు మీరున్నారా! అతను తుది శ్వాస వదులుతున్నప్పుడు తన కొడుకులను పిలిచి 'నేను వెళ్ళిపోయిన తర్వాత మీరు ఎవరిని ఆరాధిస్తారు?' అని అడిగాడు. దానికి వారంతా 'మీరు, మీ తాతముత్తాతలయిన ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్హాఖ్ (అ)లు ఆరాధించిన ఏకేశ్వరుడ్ని మాత్రమే మేము ఆరాధిస్తాము. ఆయనకే మేము విధేయులమై ఉంటాము' అని సమాధానమిచ్చారు". (దివ్య ఖుర్‌ఆన్ - 2: 133)

అలాగే లుఖ్మాన్ (అ) తన కుమారునికి హితోపదేశం చేసిన సందర్భం గుర్తుకు తెచ్చుకోండి. ఆయన తన కుమారునితో "బాబూ! అల్లాహ్‌కి (ఆయన దైవత్వంలో) ఎవరినీ సాటి కల్పించకు. దేవునికి సాటి కల్పించడం ఘోరమైన పాపం, దారుణమైన అన్యాయం" అన్నాడు. (దివ్య ఖుర్‌ఆన్ - 31: 13)

ప్రవక్తల గురించి, వారి సంతానం గురించి, వారి విశిష్ఠతల గురించి తెలియనివారంటూ ఉండరు. అయినా అంతటి మహా పురుషులు తమ సంతానాన్ని పదే పదే 'ఏకదైవారాధన చేయండి, బహు దైవారాధన మాలిన్యానికి దూరంగా ఉండండి' అని హితోపదేశం చేస్తున్నారు. కాని నేడు మనం అనేక బహుదైవారాధనా పద్ధతుల్ని యదేచ్ఛగా అమలు పరుస్తూ కూడా "మేము ముస్లిములమే" అని బీరాలు పొతున్నాము. కాదనగలరా?

విగ్రహాన్ని అన్యులు పూజిస్తే కాఫిర్
దేవునికి సంతానం కల్పిస్తే కాఫిర్
అగ్ని ముందు సాష్టాంగ పడితే కాఫిర్
నక్షత్రాల్లో మహిమను వెతికితే కాఫిర్
కాని -
మోమిన్లకై దార్లన్నీ తెరిచున్నాయి బార్లలాగా
కోరిన వారిని కోరినంతగా కొలవచ్చు హాయిగా

ప్రవక్తను ఏకంగా విభునిగా చెయ్యొచ్చు
ఇమాములకు ప్రవక్తలకన్నా పైర్యాంకు ఇవ్వొచ్చు
దర్గాలంటూ అహరహం హారతులు పట్టొచ్చు
ఔలియాలంటూ అలౌకికానందంతో ముడుపులు చెల్లించొచ్చు
అయినా -
అంతరాయమేదీ తౌహీదుకు కలగదట
తలవంపేదీ ఇస్లాంకు రాదట
అభ్యంతరమేదీ ఈమాన్‌కు ఉండదట

(ప్రసిద్ధ ఉర్దూ కవి మౌలానా హాలీ గారి అంతస్థులను అల్లాహ్ ఊర్ధ్వలోకాల్లో ఉన్నతం చేయుగాక!)

(5వ పేజీ తరువాయి భాగం...)

ఘన సంస్కృతి మనది

అవును, ఇది నిత్య ప్రస్థానం – ఇందులో ఎగుళ్ళు దిగుళ్ళు తప్పవు. ఇది నిత్య ప్రయోగం. ఎదురు దెబ్బలు తప్పవు. వల్లకాటి దిబ్బల చుట్టూ ఊళ్ళ కాపురాలు. మండే ఎడారి చుట్టూ పసిమి పండే మాగాణాలు. మారణ ధూమాన్ని ఊదేసే జీవన పవనాలు. విచ్ఛిన్న విష సంస్కృతుల తమస్సుని చీల్చుకువచ్చే ఉషోదయ కిరణాలు. ఆకులు రాలిపోతేనేమీ? చిగురాకులు పుట్టవా? నీళ్ళు ఇగిరిపోతేనేమీ? వాన మబ్బులు గజ్జె కట్టవా? అలలు చలించినప్పుడే జలానికి ఉద్దీపనం. రక్తం ప్రసరించినప్పుడే నరాలకు ఉజ్జీవనం. అణువు నుండి అంతరిక్షానికి, అంబరం నుంచి అవనీతలానికి, అనుభూతి నుంచి ఆకృతికి, అదృశ్యం నుంచి అభివ్యక్తికి జరుగుతున్న అవిరళ శోధనమిది. జారిపడుతున్నా మెట్టు మెట్టుగా ఆరోహిస్తున్న నిత్య సాధనమిది. ఇక్కడ రహదారే గమ్యం, అలుపెరగకుండా సాగిపోవడమే లక్ష్యం. ఏ మసక సందెలు అలుముకున్నా, ఏ అప్రాచ్య సంస్కృతీ నీలి నీడలు కమ్ముకున్నా ఇస్లామీయ సంస్కృతి మాత్రం కాంతి బాటయే. ఏ మంచు గడ్డలు పేరుకున్నా ఖుర్‌ఆన్ బోధ జ్వలన ధాతువే. ఆ కాంతిని హరించాలని, ఆ బోధను కబళించాలని తమస్సు తీండ్రించినప్పుడు, వల పన్ని వలయాకారంలో చుట్టు ముట్టినప్పుడు, దివ్య వచనమే ఆయుధంగా, ప్రవక్త ప్రవచనమే అంతశ్చేతన ఆలంబనగా, మానవత్వమే మహాస్త్రంగా పురోగమించాలి మనం. ప్రతికూల పరిస్థితులకు, పరిసరాల పైకెగిసి అడ్డొస్తున్న అవరోధాలను అవలీలగా దాటి, సమస్యల సునామీలను జయించి నిండు నవ్వులుగా మలచుకోవాలి మనం. మానవత్వాన్ని మాడ్చివేసే గ్రీష్మంలో మమతల మల్లెలు జల్లుతూ సాగాలి మనం. కరుణను కాటి పాలు చేసివేసే తుఫాను గాలుల మధ్యనే దయాదీపాలు వెలిగించాలి మనం. రాబందులు తలెత్తి తాండవిస్తున్న చోటే పావురాల్ని ఎగురవేయాలి మనం. ముళ్ళకంపలు తలలు బలిసి నిలుచున్న స్థానంలోనే ఉద్యాన వనాలు నాటాలి మనం.

రాళ్ళు రువ్వే రక్కసి చీకట్ల మధ్య ప్రశాంతంగా పలుకరించే కిరణాలవ్వాలి మనం. విత్తనం అనుకొని మనల్ని మట్టిలో విసిరి కొడితే, మహా వృక్షాలై నిలవాలి మనం. చీకటి ఒళ్ళు మండుతుంది 'చీకటి' అని పిలిస్తే. అజ్ఞానం ఉరిమి చూస్తుంది 'అజ్ఞానం' అని నిలదీస్తే. అది ఒక్క నోటిని నొక్కేయాలని చూస్తే లక్ష కంఠాలై మోగాలి మనం. ఆత్మ స్థయిర్యం మన ఏకైక ఆయుధం. అల్లాహ్ మన ఏకైక దైవం. ముహమ్మద్ (స) మన ఏకైక ఆదర్శం. ఖుర్‌ఆన్ మన ఏకైక మార్గదర్శక గ్రంథం. అలుముకున్న ఆధునిక చీకట్లలో వేగు చుక్కలై వెలగాలి మనం. పేరుకున్న పాశ్చాత్య సంస్కృతిలో ఇస్లామీయ సంప్రదాయాల్ని ఆవిష్కరించాలి మనం. కోరికల జీబురు పొదల్లో నీతి చంద్రికలై కదలాలి మనం. సంగీత శ్రవణాల పందిళ్ళలోన సత్య సౌరభాలు వెదజల్లాలి మనం. తోళ్ళు కప్పుకున్న తోడేళ్ళ మధ్య మానవతామూర్తులై ఎదగాలి మనం. దివ్య వచనాల స్వాతి చినుకుల్లో తడిసి ముత్యాలై సత్యామృతాన్ని ఆస్వాదించి, సంతృప్తితో ఓలలాడి పుడమి నిండా ఉషస్సులు పంచుతూ పయనించాలి మనం. కొడిగట్టిన మనో సీమల్లో కాంతిని, క్రాంతిని, శాంతిని ఆవిష్కరించాలి మనం.

ఎందుకంటారా?

బండలు లేని చోట ఉన్న నీరు రమ్యంగానే ఉంటుంది. నీరు లేని చోట ఉన్న బండలు కూడా రమ్యంగానే ఉంటాయి. ఇక, నీరు ప్రవహించే జాలులో బండలున్నా, లేక బండలగుండా నీరు ప్రవహిస్తున్నా ఆ దృశ్య లావణ్యం అద్భుతంగా ఉంటుంది. ఎంత సేపు అయినా బండల గుండా ప్రవహిస్తున్న ఆ నీటిని, ఆ నీటిని ప్రవహించనీయకుండా అడ్డుపడుతున్న ఆ బండలను చూడాలని ఉంటుంది. కదలనిది పాషాణం. కదిలే చైతన్యాన్ని కదలని జడత్వం ఆపజాలదు. అందుకే బండలను అధిగమించి నీరు నిరంతరంగా తన ప్రయాణాన్ని, ప్రవాహాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది. నిజమే మరి–,

ఏ రంగులు పులుముకున్నా
ఎప్పుడైనా గెలిచిందా చీకటి?
ఏ ఆంక్షలు నిషేధించినా
ఉదయించకుంటుందా కిరణ సంపుటి?

సౌమనస్యాన్ని ప్రసరింపజేసేందుకు మనం వేసే ఆ అడుగు, వైమనస్యాన్ని ప్రతిఘటించే తొలి నుడుగు అవ్వాలి. అందుకు రమజాను మాసంలో పొందిన శిక్షణ అన్ని విధాల దోహదపడుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

(11వ పేజీ తరువాయి భాగం)

తూరుపు దిక్కున...

ఇంట్లో గల గిన్నెలు సయితం నింపుకుందామె. చివర్లో ప్రవక్త (ﷺ) త్రాగుతూ 'ప్రజలకు త్రాపించేవాడు చివర్లో త్రాగుతాడు' అన్నారు. ఇప్పుడు నీవు చూస్తున్న ఆ సుందర స్వరూపుడే ఈసా ప్రవక్త (عليه السلام) చెప్పిన ఆదరణకర్త. ఆయనే 'నరాశంస'. పట్టుకున్నవారికి పట్టుకున్నంత క్షీరసాగరాల్ని అందించాడు ఆయన (ﷺ).

గోరింక: ధన్యుణ్ణి, ధన్యుణ్ణి. ఆయన దర్శనంతో మన జన్మ ధన్యమయ్యింది. మన జీవితం పునీతమయింది ఆహా! పక్షిగా పుట్టాలని విసుగు చెందిన మనిషి అంటున్నాడు. మనం మానవులం అయ్యుంటే ఎంత బావుండు! సత్యప్రవక్త (ﷺ) సరసన సాయంత్రాలు, సంధ్యా ప్రార్థనలు చేసేవాళ్ళు!! దివ్య జ్యోతుల్ని ప్రసరింపజేస్తూన్న ప్రియ ప్రవక్త (ﷺ) వారి మధ్యనున్నారు!!! ఈ మహిమాన్విత వ్యక్తి సముదాయపు మామూలు పౌరునిగా తనకు స్థానం కల్పించమని లోక కళ్యాణార్థం వచ్చిన ప్రవక్తలందరూ పరమోన్నత ప్రభువు సన్నిధిలో ప్రాధేయపడ్డారంటే నమ్ము. అట్టి మహితాత్ముడినా ఈ మక్కా వాసులు వెలివేసింది...! ఎంత విద్దూరం...!!

చిలుక: అవునవును. అండ పిండ బ్రహ్మాండ విచారణ, సృష్టి రహస్య ఛేదన పండితులకు ఎరుక. ఆలివ్ కాయలకై చేతులు చాచే కోతులకేమెరుక? వేప పూలలో తీపి తేనియలు తుమ్మెదలకు ఎరుక. కామదాసులై కాంతల చరణాగతులయ్యే వారికేమెరుక? తప్పులు చేసి తత్వం బోధించడం ఎందరికో ఎరుక. కర్పూర మల్లే కరిగిపోవడం కొందరికే ఎరుక. కన్న బురదకే వన్నె తేవడం కమలముల (కరుణ హృదయుల)కు ఎరుక. రేపటి కాంతికి రెప్పలార్చటం గబ్బిలములకెరుక. దీపకాంతికే రెపరెపలాడటం శలభములకు ఎరుక. అందమన్న ఈ అస్తిపంజరపు ఆచ్ఛాదన వెనుక ఆత్మ అన్న లోవెలుగుని చూడని అంధులకేమెరుక మహా ప్రవక్త ముహమ్మద్ మహిమ? అంటూ జంట పక్షులు రెండూ నిష్క్రమించాయి...

నిశి రాత్రి తొలి కోడి కూసిందో లేదో లేచి పన్నీటి జలకాలాడి, మలికోడి కూసేవేళకు కడిగిన ముత్యమల్లే, దివ్య తేజమై మడిలోని మమతల మల్లెలు, తోటలోని సాత్వికతల సన్న జాజులు, సుగుణాల సంపెంగలు, మానవత్వపు మొగలి రేకులు కోసుకుని, తలుపులు త్రోసుకుని దినమణియై ప్రకాశించేందుకు సిద్ధమవుతున్నాడు సూరీడు. మహా ప్రవక్త (ﷺ) మదీనాలో అడుగు పెట్ట బోతున్నారు..



సైదు - అబ్దుర్రహ్మాన్

నా అన్వేషణ ఫలించింది - 2

నా స్నేహితుని ద్వారా కొన్ని సందేహాలకు సమాధానాలు దొరికాయి. ఏసు తర్వాత మరో ప్రవక్త వచ్చారని, ఆయనే లాస్ట్ అండ్ ఫైనల్ ప్రవక్తని, గాబ్రేలు ద్వారా ఆయన హృదయ ఫలకంపై ఖుర్‌ఆన్ అవతరింపజేయబడిందని నా స్నేహితుడు నాతో చెప్పుకొచ్చాడు. ఆ దరిమిలా ఐపిసి ప్రచురించిన కొన్ని పుస్తకాలు, కేసెట్లు నాకందించాడు. విన్నాను, చదివాను. అయినా ఇస్లాంకు సంబంధించిన కొన్ని అపోహలు అపార్థాలు అలానే ఉన్నాయి. ధర్మం గురించి బాగా తెలిసిన పండితులెవ రైనా ఉంటే వారి వద్దకు తీసుకెళ్లమని నేనతనితో రెక్వెస్ట్ చేశాను. అతను నన్ను ఐపిసి సిటీ బ్రాంచ్‌కి తీసుకెళ్ళాడు. అక్కడి ధర్మ ప్రబోధకులతో నన్ను నేను పరిచయం చేసుకుని నాలో ఉన్న కొన్ని అపోహలను వారి ముందు పెట్టాను. వారికి – నాకు మధ్య దాదాపు ఒక రెండు నెలల పాటు జరిగిన వాగ్వివాదంలో నా ముందు అవిష్కృతమైన కొన్ని నిప్పు వంటి నిజాలు ఇవి:–

1) ఏసు వారి జననం ఓ గొప్ప దైవ మహిమ.
2) దేవుని దృష్టిలో ఏసు ఉపమానం ఆదం వంటిది. ఆదంను దేవుడు మట్టితో సృజించి 'అయిపో' అని ఆజ్ఞాపించగా ఆయన ఆది మానవుడిగా రూపుదిద్దుకున్నాడు. ఏసు తండ్రి లేకుండా జన్మించారంటే అది దేవుని గొప్పతనం అవుతుందేగాని ఏసువారిది కాజాలదు.
3) తల్లితండ్రి లేకుండా దైవాజ్ఞతో ఉనికిలో వచ్చిన ప్రవక్త ఆదం (అ) దైవ కుమారుడు కానప్పుడు, తల్లి ఉండి జన్మించిన ఏసు ఏ విధంగా దైవంగానీ, దైవ కుమారుడు గానీ కాగలరు? వాస్తవంగా దేవుడు తనకు సంతానం, భార్యాపిల్లలు ఉన్నారన్న అపవాదానికి అతీతుడు, అత్యంత పవిత్రుడూను.
4) ఆయన చేతుల మీదుగా కొన్ని మహిమలు ఇతర ప్రవక్తల్లా జరిగాయన్నది నిర్వివాదాంశము. పుట్టు గుడ్డిని బాగు చేసినా, కుష్ట రోగులకు స్వస్థతనిచ్చినా, మరణించినవారిని కాసేపు లేపినా అవన్నీ దైవాజ్ఞతోనే జరిగాయన్నది గమనార్హం.
5) ప్రపంచంలో ధర్మ సంస్థాపనార్థం వచ్చిన ఇతర ప్రవక్తల్లా ఏసు కూడా ఒక ప్రవక్త మాత్రమే.

ఇక ఏసుగారి శిలువ మరణ విషయానికొస్తే, ఏసుగారు ప్రజల పాప పరిహార నిమిత్తం శిలువపై మరణించారన్నది అవాస్తవం. సువార్తల్లోని సమాచారాన్ని బట్టి ఏసు ఎంతో వేదనతో, బాధతో, విచారంతో విలపిస్తూ ప్రార్థించారు: "నీ చిత్తమైతే ఈ గిన్నెను నా యొద్ద నుండి తొలగించుము". మన దేశ స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ ఇంకా వేరే వీర జవానుగానీ దేశం కోసం ఎంతో సంతోషంతో మనస్ఫూర్తిగా ప్రాణాలు అర్పించారు. మరలాంటప్పుడు మనుషుల పాపాల కోసం శిలువపై రక్త తర్పణార్థం ఏసు ఎంతో ఉత్సాహంతో, సంతోషంతో ముందుకు రావాలికదా? కాబట్టి శిలువ శిక్ష అమలు అయ్యుండచ్చు గానీ శిలువపై ఆయన మరణం అన్నది పచ్చి అబద్ధం.

చివరిగా తేటతెల్లమయ్యేదేమిటంటే, ఏసు కేవలం దైవ ప్రవక్త మరియు ఆయన దాసుడు. శిలువపై మరణించేందుకు ఆయన ప్రభవించలేదు. ప్రజల్ని సన్మార్గాన్ని చూపించటానికే ఆయన వచ్చారు. అలా వచ్చిన ఆ మహాత్ముడు తన కర్తవ్యాన్ని నెరవేర్చి, తన తర్వాత మరో ప్రవక్త రాబోతాడని, అతని మీదే దేవుడు ధర్మాన్ని సంపూర్ణం గావిస్తాడని, ఆ రాబోయే ఆదరణకర్త తనను మహిమ పరుస్తారని చెప్పి మరీ వెళ్ళారు. అలాగే యోహోవాను ఏసు (అ) వారు ఏలీగా పిలిచారని,అరబీలో అల్లాహ్ అంటారని, అల్లాహ్ కేవలం ముస్లిం దేవుడన్నది ఒక అపోహ మాత్రమేనని, ఆయన సమస్త లోకాలకు ప్రభువు, పరి పాలకుడని, ఆయనే ఆదం, నూహ్, ఇబ్రాహీమ్, యూసఫు, యాకూబు, మూసా, జెకరియ్యా, యహ్యా, ఈసా, ముహమ్మద్ ప్రవక్తలందరికీ ఆరాధ్య దైవం అని ఆ రెండు నెలల్లో తెలుసు కున్నాను.

ఆ తర్వాత మరికొన్ని పుస్తకాలు చదివి, సీడీలు చూసి **"అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ రసూలుల్లాహ్, వ అష్హదు అన్న ఈసా అబ్దుల్లాహి వ రసూలుహు, లమ్ యున్‌లబ్ వలమ్ యుఖుల్ బల్ రఫఅహుల్లాహు ఇలైహి"** అని త్రికరణ శుద్ధితో పరిపూర్ణ ధర్మమైన ఇస్లాంను స్వీకరించాను. అలా నేను మరిచిన బాటపై మళ్లీ రాగలిగాను. ఇదంతా దైవ కృపే తప్ప ఇందులో నా గొప్ప ఏమీ లేదు. ఆయన తాను తలచినవారికి సన్మార్గ భాగ్యాన్ని ప్రసాదిస్తాడు.

ప్రియ సోదరులారా! ఈ ప్రపంచం ఒక పరీక్షా స్థలం. మనం ఈ ప్రపంచంలో ఉండగానే మిథ్య అనే మహమ్మారి మాయలో పడకుండా, నిజ దైవాన్ని గ్రహించి, ఆయన ఆజ్ఞానుసారం జీవిస్తే మన కోసం మరో శాశ్వతమైన జీవితం ఉంటుంది. అదే పరలోక జీవితం, స్వర్గంలో శాశ్వతంగా సమస్త భోగ భాగ్యాలతో ప్రశాంతంగా బ్రతకగలం. అల్లాహ్ మనందరికీ స్వర్గ సాఫల్య భాగ్యాన్ని ప్రసాదించుగాక! ఆమీన్.

...అవును, మనదొక విశిష్ట సముదాయం! మంచిని పెంపొందించటానికి, చెడును నిర్మూలించటానికి విశ్వ ప్రభువు తరఫున ఉనికిలోనికి తీసుకురాబడిన అత్యుత్తమ సమాజం!!

ఈ సముదాయంలో రకరకాల జనులున్నారు. కాలు జారి పడిపోయేవారు కొందరైతే చేయూత నిచ్చి నిలిపేవారు కొందరు...
సహాయం కోరేవారు కొందరైతే, సహాయం చేయటంలోని ఆనందాన్ని ఆస్వాదించేవారు కొందరు...

కష్టాల్లో చిక్కుకున్నవారు కొందరైతే, కాపాడేవారు కొందరు... ఇచ్చేవారు కొందరైతే, పుచ్చుకునేవారు కొందరు..
ఈ నేపథ్యంలో మహనీయ ముహమ్మద్ (స) వారి ఉపదేశం మరువరానిది.

"విశ్వాసికి
ప్రపంచంలో ఎదురయ్యే
కష్టాలలోని ఒక కష్టాన్ని గనక
ఎవడైనా దూరం చేస్తే, అల్లాహ్
పరలోకంలో అతనికి ఎదురయ్యే కష్టాలలోని
ఒక కష్టాన్ని దూరం చేస్తాడు. ఇబ్బందుల్లో ఉన్న
ఒక అభాగ్యునికి ఎవరయినా సౌలభ్యాన్ని చేకూరిస్తే
అల్లాహ్ వారికి ఇహంలోనూ పరంలోనూ
సౌలభ్యాన్ని ప్రసాదిస్తాడు... దాసుడు సాటి
సోదరునికి సహాయం చేస్తున్నంత సేపూ
అల్లాహ్ ఆ దాసునికి సహాయం
చేస్తూనే ఉంటాడు".
(ముస్లిం)



వివేచన

CAMS
معهد كامز للتدريب الأهلي
CENTRE FOR COMPUTER & MANAGEMENT STUDIES

కువైట్ ఔఖాఫ్ పబ్లిక్ ఫౌండేషన్ వారి
ఉదాత్త పర్యవేక్షణలో ఇస్లాం ప్రజెంటేషన్
కమిటీ, అన్ని బ్రాంచీలలో నిర్వహించే

الأمانة العامة للأوقاف



అరబ్యేతరుల కొరకు అరబీ కోర్సు

01-09-2010 నుండి రిజిస్ట్రేషన్ మొదలు

అక్టోబరు మొదటి తేదీ వరకు మాత్రమే పేర్లు నమోదు చేసుకోబడతాయి. మొత్తం కోర్సు 32 గంటలు ఉంటుంది.

కోర్సు అనంతరం CAMS తరపున సర్టిఫికేట్ ఇవ్వబడుతుంది.

మీ సమీప బ్రాంచ్‌లో మీ పేరు నమోదు చేయించుకోండి

Hot Line: 94066743, 94066954

www.ipc-kw.com

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

رحمة للعالمين...

KPCC	Al mulla saleh	Salwa	Sharq	Aware Center	Rawda	Salimiyah	Farwaniyah	Almangaf	Al-Jahra
24712574	22444117	25637900	22418934	25335260	22511301	25733263	24735627	23723002	24558830
97802777	65159513	94064491	22418917	25335280	22512257	97533263	99868285	99256165	97509063
			94066743	97310826	97290278		99285459	99630946	67720696